**విలేకరులు కావలెను**

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189

# మనవార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET
MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 174 | volume: 1, Issue:174 | గురువారం 22 జనవరి 2026 పేజీలు : 8 వెల : 3.00

## తెలంగాణ రైజింగ్‌తో పెరిగిన అంతర్జాతీయ నమ్మకం



**దావోస్:** ప్రతి ఏడాది జులై లేదా ఆగస్టులో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫాలో–అప్ సదస్సు నిర్వహించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరిగిన 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. పెట్టుబడుల ఒప్పందాలు వేగంగా కార్యరూపం దాల్చేందుకు మధ్యంతర ఫోరం అవసరమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏడాది ఆలస్యం కాదుడ వేగమే అవసరంప్రస్తుత ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా ఎక్కువ సమయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందుకే దావోస్ సమావేశాల మధ్యలో హైదరాబాద్‌లో ఫాలో–అప్ ఫోరం నిర్వహించాలని వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రతినిధులకు సూచించారు. ఇలా జరిగితే ఎంవోయూలు త్వరగా ప్రాజెక్టులుగా మారి, పెట్టుబడులు భూమిపై కనిపిస్తాయని వివరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా 5.75 లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు ఆకర్షించామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. గతంలో ఎంవోయూల కోసం మాత్రమే దావోస్‌కు వచ్చేవాళ్లమని, ఈసారి తెలంగాణ రైజింగ్ విజన్, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలను ప్రపంచానికి వివరించేందుకే వచ్చామని చెప్పారు. ఈ విజయమే గ్లోబల్ మద్దతుకు కారణమైందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో కలిసి వారు విందులో పాల్గొని గ్లోబల్ ప్రతినిధులతో మమేకమయ్యారు. ఈ భేటీ తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకొచ్చిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## భారత్ స్పెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు




**న్యూఢిల్లీ:** కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ బుధవారం ఉదయం స్పెయిన్ విదేశాంగ మంత్రి హోసే మాన్యుయెల్ ఆల్బారెస్తో విస్తృత స్థాయి ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. భారత్–స్పెయిన్ మధ్య కొనసాగుతున్న సహకారం, ప్రపంచ వ్యవహారాల్లో ఉభయ దేశాల దృష్టికోణాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సాంకేతికత, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి కీలక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించే అంశాలపై ఇద్దరు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. రాజకీయ స్థాయిలో కొనసాగుతున్న బలమైన సంభాషణను మరింత పటిష్టం చేయాలన్న సంకల్పాన్ని పునరుద్ఘాటించారు. భారత్□యూరోపియన్ యూనియన్ సంబంధాలను వివిధ రంగాల్లో లోతుగా తీసుకెళ్లేందుకు స్పెయిన్ అందిస్తున్న మద్దతుకు జైశంకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహకారం భారత్‌కు వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యత కలిగినదిగా ఆయన పేర్కొన్నారు. ఇదే సందర్భంగా ఇండో□పసిఫిక్ ఓషన్స్ ఇనిషియేటివ్‌లో స్పెయిన్ చేరడాన్ని కేంద్ర మంత్రి జైశంకర్ హర్షంతో స్వాగతించారు. ఈ భాగస్వామ్యం ద్వారా సముద్ర భద్రత, స్థిరమైన అభివృద్ధి, అంతర్జాతీయ సహకారం మరింత బలోపేతం అవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## కిష్త్వార్‌లో ఐఏఎఫ్ విజయవంతమైన నైట్ మెడివాక్



**న్యూఢిల్లీ:** కిష్త్వార్ సెక్టార్‌లో భారత వైమానిక దళం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో నైట్ టైమ్ మెడికల్ ఎవాక్యుయేషన్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించింది. కఠిన భూభాగం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య ఇద్దరు తీవ్రంగా గాయపడిన సిబ్బందిని సురక్షితంగా గాలిమార్గంలో తరలించింది. ఈ స్థాయి సన్నద్ధత 'జాయింట్ ఆప్స్ స్టామినా హోనింగ్' (జోష్) విన్యాసాల ద్వారా సంస్థాగతంగా బలపడిందని పేర్కొన్నారు. ఈ విన్యాసాలు సైనిక దళాల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్టం చేసి, అన్ని విభాగాల్లో ఏకీకృతంగా పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందిస్తున్నాయి. ఈ మెడివాక్ ఆపరేషన్ ద్వారా భారత వైమానిక దళం తన వృత్తిపరమైన నైపుణ్యం, శిక్షణా పరమైన కట్టుదిట్టతను మరోసారి చాటుకుంది. అన్ని వాతావరణాల్లో, పగలు రాత్రి తేడా లేకుండా ఆపరేషన్‌లు నిర్వహించగల సామర్థ్యం తమకుందని స్పష్టం చేస్తూ, అవసరమైన వేళ ఎక్కడైనా, ఎప్పుడైనా మిషన్ విజయాన్ని సాధించగల శక్తిని ఐఏఎఫ్ మరోసారి నిరూపించింది.

## రిపబ్లిక్ డే పరేడ్‌లో చరిత్ర సృష్టించనున్న మహిళా అధికారి



**న్యూఢిల్లీ:** రిపబ్లిక్ డే పరేడ్‌లో భారత భద్రతా దళాల చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించేందుకు జమ్మూ కాశ్మీర్‌కు చెందిన 26 ఏళ్ల మహిళా అధికారి సిద్ధమయ్యారు. జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరీ జిల్లా నౌషెరాకు చెందిన సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సిమ్రన్ బాల జనవరి 26, 2026న న్యూఢిల్లీలోని కార్తవ్య పథ్‌పై జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పూర్తిగా పురుషులతో కూడిన సీఆర్పీఎఫ్ మార్చింగ్ కాంటింజెంట్‌కు నాయకత్వం వహించనున్నారు. ఇది జాతీయ స్థాయి రిపబ్లిక్ డే పరేడ్‌లో 140 మందికి పైగా పురుష సిబ్బందితో కూడిన బృందాన్ని ఒక మహిళా అధికారి కమాండ్ చేయడం ఇదే తొలిసారి. ఈ చారిత్రక ఘట్టం భారత భద్రతా దళాల్లో లింగ సమానత్వం, ప్రతిభకు లభిస్తున్న గుర్తింపుకు నిదర్శనంగా నిలవనుంది. సిమ్రన్ బాల యూపీఎస్సీ నిర్వహించే కేంద్ర సాయుధ పోలీస్ బలగాల పరీక్షను ఉత్తీర్ణత సాధించి, తన జిల్లాలో నుంచే సీఆర్పీఎఫ్ అధికార హోదాకు చేరిన తొలి మహిళగా గుర్తింపు పొందారు. సీఆర్పీఎఫ్ అకాడమీలో కఠిన శిక్షణ పొందిన ఆమె, ఆపరేషన్ విధుల్లోనూ, క్లిష్ట ప్రాంతాల్లోనూ సేవలందించారు. ఆమె నియామకం భారత భద్రతా దళాల్లో మహిళలకు పెరుగుతున్న అవకాశాలను, ప్రతిభ ఆధారంగా నాయకత్వ స్థానాలకు ఎదుగుతున్న దృక్పథాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. రిపబ్లిక్ డే పరేడ్‌లో సిమ్రన్ బాల నాయకత్వం యువతకు, ముఖ్యంగా యువ మహిళలకు స్ఫూర్తిదాయకంగా మారనుందని భద్రతా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## సింగరేణి టెండర్లలో కోట్ల బొగ్గు కుంభకోణం




**రామగిరి:** సింగరేణి టెండర్లలో 'సైట్ విజిట్' నిబంధనను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం కోట్ల రూపాయల బొగ్గు కుంభకోణానికి పాల్పడిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించాయి. ప్రజాధనాన్ని పందికొక్కుల్లా మేస్తూ సింగరేణిని కొల్లగొడుతున్న కాంగ్రెస్ నేతల అవినీతిని ఎండగడుతూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో రామగిరి మండలం సెంటనరీ కాలనీ ఆర్ జి 3 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ, టెండర్ల ప్రక్రియలో నిబంధనల పేరుతో అక్రమాలకు తావిచ్చారని విమర్శించారు. సింగరేణి లాభాలను కొద్ది మంది స్వార్థ ప్రయోజనాల కోసం దోచుకుంటున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ, కార్మికుల హక్కులు, సంస్థ ప్రయోజనాలు పక్కనపెట్టి అవినీతికి తలుపులు తెరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ప్రతిష్ఠను కాపాడేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సింగరేణిలో అవినీతి ఆరోపణలపై ప్రభుత్వ స్పందన రావాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ప్రపంచ వారసత్వ కట్టడమైన తాజ్‌మహల్‌కు సీఐఎస్ఎఫ్ కట్టుదిట్ట భద్రత



**ఆగ్రా:** ప్రపంచ అద్భుతాల్లో ఒకటైన తాజ్‌మహల్‌ను సురక్షితంగా కాపాడుతూ, దేశ విదేశాల నుంచి వచ్చే లక్షలాది పర్యాటకులకు భద్రతతో కూడిన సందర్శన అనుభూతిని అందించడంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం కీలక పాత్ర పోషిస్తోంది. ప్రేమకు ప్రతీకగా నిలిచిన ఈ చారిత్రక కట్టడాన్ని అన్ని విధాలా రక్షిస్తూ సీఐఎస్ఎఫ్ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తోంది. అత్యున్నత స్థాయి అప్రమత్తత, వృత్తిపరమైన నైపుణ్యం, అంకితభావంతో సీఐఎస్ఎఫ్ సిబ్బంది తాజ్‌మహల్ పరిసరాలను పర్యవేక్షిస్తున్నారు. దేశం ముందు అన్న భావనతో విధులు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది కృషి వల్లనే తాజ్‌మహల్ ప్రపంచ పర్యాటకులకు సురక్షితంగా దర్శనమిస్తోంది. భారత వారసత్వానికి రక్షణ కవచంగా నిలుస్తున్న సీఐఎస్ఎఫ్ సేవలు దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నాయి.

## రోడ్డు భద్రతపై అవగాహన కోసం గాలిపటాల పండుగ: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్

**-ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులతో కలిసి గాలిపటాలు ఎగురవేసిన పోలీస్ కమిషనర్ ఎస్ రష్మీ పెరుమాళ్...**

**సిద్దిపేట జిల్లా, జనవరి 21, మన వార్త ప్రతినిధి** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ చేపట్టిన ' అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా నేడు కమిషనరేట్ పరేడ్ మైదానంలో ఘనంగా గాలిపటాల పండుగను నిర్వహించారు. ఈ వేడుకకు పోలీస్ కమిషనర్ ఎస్ రష్మీ పెరుమాళ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మెరిడియన్ స్కూల్, అంబిటస్ స్కూల్, వికాస్ హైస్కూల్ సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థులు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ స్వయంగా విద్యార్థులతో కలిసి గాలిపటాలు ఎగురవేసి వాళ్ల లో నూతనోత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ "ప్రాణం ఎంతో విలువైనది. గాలిపటం ఎగురవేసేటప్పుడు మనం ఎంత జాగ్రత్తగా ఉంటామో, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు కూడా అంతే ఏకాగ్రతతో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించడం బాధ్యతగా గుర్తించాలని" విద్యార్థులకు, యువతకు పిలుపునిచ్చారు. గాలిపటాల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు కమిషనర్ స్వయంగా బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పాఠశాలల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ ( అడ్మిన్ ) కుశాల్కర్ ,అదనపు డీసీపీ ( ఎ ఆర్ ) సుభాష్ చంద్రబోస్, అన్ని డివిజన్ ఏసిపి లు , ఇన్స్పెక్టర్ లు , ఎస్ ఐ లు ,పోలీస్ సిబ్బంది మరియు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## హెడ్ కానిస్టేబుల్ నుండి ఎ ఎస్ఐ ప్రమోషన్ పొందిన ఎండీ. మిస్బా ఉద్దీన్

**-ఏ . స్వాతి రెడ్డి లను అభినందించిన పోలీస్ కమిషనర్ ఎస్ రష్మీ పెరుమాళ్ ,ఐపీఎస్....**

**సిద్దిపేట జిల్లా, జనవరి 21, మన వార్త ప్రతినిధి** హెడ్ కానిస్టేబుల్ నుండి ఎ ఎస్ఐ ప్రమోషన్ పొందిన ఎండీ. మిస్బా ఉద్దీన్ ఏ . స్వాతి రెడ్డి లను అభినందించిన పోలీస్ కమిషనర్ ఎస్ రష్మీ పెరుమాళ్ ,ఐపీఎస్ ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు, పదోన్నతులు పొందిన పోలీస్ సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని కోరారు. పోలీసు శాఖలో క్రమశిక్షణతో బాధ్యతగా విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, మర్యాదలు లభిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో( సీ సీ ఆర్ బి ) ఇన్స్పెక్టర్ రామ కృష్ణ ఉన్నారు.



## సరస్వతి మాత గౌతమ బుద్ధుడి, విగ్రహాలను ఆవిష్కరించిన అధికారులు...



**చిన్న శంకరంపేట జనవరి 21 ( మన వార్త ప్రతినిధి)** చిన్న శంకరంపేట మండలం సూరారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002 2003 సంవత్సరపు 10వ తరగతి పూర్వ విద్యార్థులు బిపేట సిద్ధిరాములతో పాటు వారి సహచర విద్యార్థుల ఆర్థిక సహాయం సుమారు 3 లక్షల రూపాయల వ్యయం తో ఏర్పాటు చేసిన సరస్వతి మాత విగ్రహం, గౌతమ బుద్ధుని విగ్రహం, సభా వేదిక, నూట నలభై కుర్చీలను ఏర్పాటు చేశారు, ఏర్పాటు చేసిన విగ్రహాలను నేడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయి రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు, ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి విజయ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక సర్పంచ్ చిలుక నాగరాజు మండల విద్యాధికారి పుష్పవేని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయి రెడ్డిలతో కలిసి వాటిని ప్రారంభించారు, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి, వచ్చిన అతిథులను 2002 2003, 10వ తరగతి విద్యార్థులు శాలువా పూలమాలల తో ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి విజయతోపాటు అతిథులు మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సేవ చేసే చేతులు మిన్న అన్న విధంగా 2002 2003 సంబంధించిన పూర్వ విద్యార్థులు 21 మంది పాఠశాల అభివృద్ధి కోసం డబ్బులను కేటాయించి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం చాలా అభినందనీయమని పాఠశాల అభివృద్ధి కోసం ప్రధానోపాధ్యాయుడు చేసిన కృషి మరువలేనిదని వారన్నారు గత సంవత్సరం పదవ తరగతి పరీక్షలలో 100% ఉత్తీర్ణత సాధించడం జరిగిందని ఈ సంవత్సరం కూడా రాష్ట్రస్థాయిలో ర్యాంకు వచ్చే విధంగా కృషి చేయాలని వారు కోరారు. ఈ పాఠశాలలో చదువుకున్న 21 మంది విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరించడం చాలా గొప్ప విషయమని వృత్తిరీత్యా ఎక్కడో ఉన్న తాము చదువుకున్న పాఠశాలను గుర్తించుకొని ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని వారన్నారు వీరిని ఆదర్శంగా తీసుకొని ఇప్పుడు చదువుకునే విద్యార్థులు సైతం మంచి ఉన్నత స్థాయికి ఎదిగి వారు కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని వారు కోరారు, ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ మండల విద్యాధికారి పుష్పవేని, తూప్రాన్ మండల విద్యాధికారి సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ నాగరాజు, ఉపసర్పంచ్ మల్లేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయి రెడ్డి, 2002 2003 10వ తరగతి విద్యార్థులు సిద్ధిరాములు, అక్బర్, రంజిత్, వేణు, అశోక్, జ్యోత్స్నశ్రీ, యాదగిరి, దివ్యశ్రీ,సుచిత్ర, ముబీనా బేగం, కృష్ణ,

## సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు



**సిద్దిపేట జిల్లా,జనవరి 21, మన వార్త ప్రతినిధి** సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ 7 (1), 2016, యాక్ట్, 22 (1) (ఏ )నుండి (ఎఫ్ ) 22 (2) (ఏ) & ( బి), & 22 (3) సిటీ పోలీస్ యాక్ట్, 1348 నో ఐస్ ఫాస్లి సెక్షన్ 30 పోలీస్ యాక్టు 1861 ప్రకారం జనవరి 23 ఉదయం 6:00 నుండి ఫిబ్రవరి 7,ఉదయం 6 గంటల వరకు ఆమలులో ఉంటుంది. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదు. పైన పేర్కొన్న కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలి, బంద్ ల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి,బెదిరింపులకు గురిచేసే వాళ్ల పై చట్టపరంగా చర్యలు తీసుకుంటాము. శాంతిభద్రతల పరిరక్షణ నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించడమైనది.సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు జనవరి 23 ఉదయం 6 గంటల నుండి ఫిబ్రవరి 7,ఉదయం 6 గంటల వరకు ఆమలులో ఉంటుంది.సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ 7(1) 2016, యాక్ట్, సెక్షన్ 55 డి బి (ఏ), 45 డి బి (ఏ),65డి బి (ఏ), 30 పోలీస్ యాక్ట్ 1861, రూల్ నెంబర్ 8 నోస్ పొల్యూషన్, (రెగ్యులేషన్ & కంట్రోల్) రూల్స్ 2000 ప్రకారం పోలీస్ కమిషనర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు..పై నిబంధనలు ఉల్లంఘించిన వాళ్లపై సెక్షన్ 223 బిఎన్ఎస్ , సెక్షన్ 70(ఏ), 70(బి) 70 జ, 76, సిటీ పోలీస్ యాక్ట్ 1348 ఫాస్లి సెక్షన్ 76, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేయడమైనది.

## ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనల, అవగాహన కౌన్సిలింగ్..



**సిద్దిపేట జిల్లా, జనవరి 21, మన వార్త ప్రతినిధి** కమీషనర్ ఆఫ్ పోలీస్ సిద్దిపేట ఆదేశానుసారం 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ ప్రోగ్రాం లో భాగంగా సిద్దిపేట పట్టణంలో బుధవారం సిద్దిపేట ఓల్డ్ బస్టాండ్ ఆటో యూనియన్ ఆటో డ్రైవర్లుకు డ్రైవింగ్ లైసెన్స్, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు భద్రత గురించి కౌన్సిలింగ్ నిర్వహించిన ట్రాఫిక్ ఎస్సై విజయభాస్కర్, ఎస్ ఐ ఉమేష్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి , ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్ తప్పకుండా వెంబడి ఉంచుకోవాలని సూచించారు. ఆటోలు కేటాయించిన పార్కింగ్ ప్రదేశంలో పార్కు చేయాలని రోడ్డుకు అడ్డదిడ్డంగా పార్కు చేయవద్దని తెలిపారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. మద్యం సేవించి ఆటోలు నడపవద్దని మద్యం సేవించి ఆటోలు నడిపి మీ ప్రాణాల తో పాటు ఆటోలో ప్రయాణించే ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలో నెట్టకూడదని,చెప్పడం జరిగింది, ఆటల్లో లౌడ్ సౌండ్ స్పీకర్స్ పెట్టి ఆటోలు నడిపితే, పరిమితికి మించి వాహనదారులను ఎక్కించుకొని నడిపిన మోటార్ వెహికల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించడం జరిగింది. ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ ఖచ్చితంగా యూనిఫామ్ ధరించాలని రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ప్రమాదరహిత సమాజంలో మీరు కూడా భాగస్వామి కావాలని సూచించారు,ఈకార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ విజయభాస్కర్, ఎస్ ఐ ఉమేష్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, కానిస్టేబుల్ శ్రీనివాస్, అఖిల్, ఆనంద్, స్వప్న, ఆటో యూనియన్ డ్రైవర్స్ యూనియన్ ప్రెసిడెంట్ పాషా పాల్గొన్నారు.

## ఉమ్మడి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం



**చందుర్తి, జనవరి 21, మన వార్త.** చందుర్తి ఉమ్మడి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లింగాల లింగయ్య ఆధ్వర్యంలో టీయూడబ్ల్యూజే హెచ్ - 143 జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా సమక్షంలో నూతన ప్రెస్ క్లబ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా లింగాల తిరుమల్, ఉపాధ్యక్షులు రాజూరి విష్ణు, ప్రధాన కార్యదర్శి మ్యాకల కొమురయ్య, కోశాధికారి మేడిశెట్టి మధు, కార్యదర్శి వంకాయల కార్తీక్, కొడగంటి గంగాధర్, గౌరవ అధ్యక్షులుగా లింగాల లింగయ్య, ఏనుగుల కృష్ణ, గౌరవ సలహాదారులు గొట్టే మనోహర్, కార్యవర్గ సభ్యులు రాజూరి సద్గుణ చారి, రాజురి రఘురాం, బొట్లవార్ శ్రీనివాస్, నక్క యాకూబ్, మర్రి నిశాంత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా మాట్లాడుతూ, ముందుగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్, టియుడబ్ల్యూజేహెచ్ - 143 సంఘం జర్నలిస్టుల హక్కుల కోసం, సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. ఇటీవల జర్నలిస్టుల అక్రిడేషన్ విషయంలో ముందుండి పోరాడిన ఘనత మనదని అన్నారు. నేడు చందుర్తి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం సంతోషకరమని రాబోవు రోజుల్లో జర్నలిస్టుల హక్కుల కోసం వారి సంక్షేమం కోసం సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్, కార్యవర్గ సభ్యులు అలీ, విజయ్,తదితరులు పాల్గొన్నారు.

## 7వ వార్డు కౌన్సిలర్ బరిలో ఆర్యన్ కౌశిక్..



**-బీ ఆర్ ఎస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి...**

**జమ్మికుంట, జనవరి 21( మన వార్త ప్రతినిధి):** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జమ్మికుంట పట్టణంలోని 7వ వార్డు నుంచి బీ ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిగా సీనియర్ నాయకుడు ప్రజా సేవకుడు యేబూషి రామస్వామి తనయుడు యేబూషి ఆర్యన్ కౌశిక్ తండ్రి ఆశయ సాధనకోసం ప్రజా సేవ కోసం ఎన్నికల బరిలో దిగుతున్నారు. ఆదరించి ఆశీర్వదించి ఒక్క అవకాశం ఇవ్వండి అని ఆయన ప్రజలను కోరుతున్నారు. వార్డు ప్రజలు ఆశీర్వదించి ఒక అవకాశం కల్పిస్తే, 7వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సుపరిచితుడైన తనను మీ బిడ్డగా ఆదరించి గెలిపిస్తే వార్డు అభివృద్ధి తోపాటు వార్డు ప్రజల సమస్యల పరిష్కారశీ కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్య తన సమస్య గా భావించి అండగా నిలబడతానని తెలిపారు. ప్రజల విశ్వాసంతో గెలిస్తే నిస్వార్థంగా ప్రజా సేవ చేయడమే నా లక్ష్యమని స్పష్టం చేశారు.

## రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ను ప్రారంభించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు...



**చేగుంట జనవరి 21 ( మన వార్త ప్రతినిధి)** చేగుంట మండలం వడియారం రైల్వే స్టేషన్ లో ఏర్పాటు చేసిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను మెదక్ ఎంపీ రఘు నందన్ రావు ప్రారంభించారు. అనంతరం చేగుంట గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన స్థానిక సర్పంచ్ స్రవంతి సతీష్ తో కలిసి సందర్శించారు గ్రామపంచాయతీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు చేగుంట మండల కేంద్రంలో నాలుగు అంగన్వాడి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు .ఈ సందర్భంగా ఎంపీ రఘు నందన్ రావు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను ప్రారంభించామని తెలిపారు. ఇకపై రైల్వే రిజర్వేషన్ టికెట్ల కోసం హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వడియారం లోనే రిజర్వేషన్ సౌకర్యం లభిస్తుందని త్వరలో చేగుంట లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. చేగుంట లో రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తయితే రైల్వే ట్రాక్ దాటే సమయంలో జరుగుతున్న ప్రమాదాలకు చెక్ పడుతుందని వాహన రాకపోకలు సులభతరం అవుతాయని అన్నారు.వడియారం రైల్వే స్టేషన్‌లో దేవగిరి ఎక్స్‌ప్రెస్, అజంతా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఎంపీ వెల్లడించారు. మేడ్చల్ నుండి కామారెడ్డి వరకు రైల్వే డబుల్ ట్రాక్ పనులు ప్రారంభం అయ్యాయి అని డబుల్ ట్రాక్ ప్రారంభమైతే రైళ్ల రాకపోకలు వేగవంతమవడంతో పాటు కొత్త రైళ్లకు మార్గం సుగమం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు స్రవంతి సతీష్, సాయి కుమార్ గౌడ్, ఉప సర్పంచ్లు రఫీ, నాగ రాజు, పాలక వర్గ సభ్యులు , బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి , నాయకులు చిలుకమర్రి గోవింద్, కొండి స్వామి, భూపాల్ , కరణం గణేష్ రవికుమార్, ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్రమాలు అవినీతి వ్యవహారాలపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి..



**-మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్...**

**రామయంపేట జనవరి 21(మన వార్త ప్రతినిధి )** రామాయంపేట మున్సిపాలిటీలో చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలు, మోసాలు, అవినీతి వ్యవహారాలపై పూర్తిస్థాయి, నిష్పక్షపాత విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ గారు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఆర్థిక లావాదేవీలు, పరిపాలనా నిర్ణయాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం, అధికార దుర్వినియోగం, అవినీతికి పాల్పడడం ఏ స్థాయిలోనూ సహించబోమని ఎమ్మెల్యే గారు హెచ్చరించారు. విచారణలో మున్సిపల్ కమిషనర్ గానీ, ఇతర అధికారులు గానీ మోసం లేదా అవినీతికి పాల్పడినట్లు తేలితే, వారిని తక్షణమే సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన, స్వచ్ఛమైన పాలనకు కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ తెలిపారు, పదవి ప్రభావం ఏమాత్రం పట్టించుకోకుండా తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు. విచారణను త్వరగా పూర్తి చేసి పూర్తి స్థాయి నివేదికను త్వరితగతిన సమర్పించాలని అధికారులను ఆదేశిస్తూ, రామాయంపేట ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## ఇందిరమ్మ చీరలను అందజేసిన సర్పంచ్ సబితా రవీందర్ గౌడ్...



**చిన్న శంకరంపేట జనవరి 21 ( మన వార్త ప్రతినిధి )** చిన్న శంకరంపేట మండలం అంబాజీపేట గ్రామంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు సుమారు 250 మందికి ఇందిరమ్మ చీరలను స్థానిక సర్పంచ్ సబితా రవీందర్ గౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు, మహిళలకు చీరలు పంపిణీ చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు, ఈ సందర్భంగా సర్పంచ్ సబితా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ అంబాజీపేట గ్రామం లో సుమారు 250 మందికి ఇందిరమ్మ చీరెలు రావడం జరిగిందని, వాటిలో 75% పంపిణీ చేయడం జరిగిందని మిగతావి కూడా త్వరలో ఇవ్వడం జరుగుతుందని, ప్రస్తుతం గ్రూప్ సభ్యులకు ఇవ్వడం జరుగుతుందని గ్రూప్లో లేని మహిళలకు కూడా త్వరలో అందివ్వడం జరుగుతుంది ఆమె తెలిపారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ సబితా రవీందర్ గౌడ్, ఉప సర్పంచ్ ద్యాప రాజు, ఐకెపిసిసి రాజు, పాలకవర్గ సభ్యులు మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు మార్కుక్ ఉన్నత పాఠశాలలో ప్రతిభా టెస్టు




**సిద్దిపేట జిల్లా జనవరి 21, మన వార్త ప్రతినిధి** సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం మర్కుక్ మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో ప్రతిభ పాట వాళ్లను వెలికితీయడానికి మండల స్థాయిలోని ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మార్కుక్ ఉన్నత పాఠశాలలో ప్రతిభా టెస్టు నిర్వహించడం జరిగింది..ఈ పరీక్షల లో ఇంగ్లీష్ మీడియం విభాగంలో మొదటి స్థానం కే దీపక్ రెండవ స్థానం బి శ్రీజ మూడో స్థానం,నందిని( కేజీబీవీ) తేజస్విని సంయుక్తంగా గెలుపొందడం జరిగింది. తెలుగు మాధ్యమంలో మొదటి స్థానం ఎం జయప్రకాష్ రెండవ స్థానం సిహెచ్ శివప్రసాదులు గెలుచుకున్నారు . ఈ సందర్భంగా సోషల్ ఫోరం మండల కన్వీనర్ యు. గణేష్, మండల విద్యాధికారి ఎం. వెంకట రాములు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జి. వెంకటశం, పిఆర్టియు మండల అధ్యక్షులు ఆర్. శ్రీనివాసరావు మాధవి ,కేజీబీవీ ఉపాధ్యాయురాలు పి. రాణి, పాములపర్తి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నరోత్తం రెడ్డి, రజనీ, చేబర్తి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రమాకాంత్ రావు,కాంతరావు,దామరకుంట ఉపాధ్యాయులు వై వెంకట్ నరసింహ రెడ్డి,మర్కుక్ఉన్నత పాఠశాలఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గెలిచిన విద్యార్థులకు అభినందనలు తెలియజేయడం జరిగింది

## వల్లంపట్ల గ్రామంలో సీఎమ్ కప్ ప్రారంభం..

**–యువత క్రీడలపై దృష్టి పెట్టాలి:సర్పంచ్ నేరెళ్ల విజయ్...**

**ఇల్లంతకుంట,జనవరి 21 (మన వార్త ప్రతినిధి);**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ వార్షిక సీఎమ్ కప్ క్రీడా పోటీలు ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్ల గ్రామంలో మంగళవారం



ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ నేరెళ్ల విజయ్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,క్రీడలు యువతకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయని తెలిపారు. యువత మొబైల్ ఫోన్లలో చెడు అలవాట్లకు లోనుకాకుండా క్రీడలపై దృష్టి సారిస్తే ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని,జీవితంలో ముందుకు సాగేందుకు మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కర్ల వంశీ, వల్లంపట్ల జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు దూసా గోవర్ధన్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్,పీటీ సబీర్,గ్రామ నూతన వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీని నిలబెట్టుకున్న వార్డు సభ్యుడు..

**–ఒబులాపూర్ హనుమాన్ గుడి వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు...**

**ఇల్లంతకుంట,జనవరి 21 (మన వార్త ప్రతినిధి);**ఇల్లంతకుంట మండలంలోని ఒబులాపూర్ గ్రామంలో



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ నూకల శ్రీశైలం నాలుగో వార్డు సభ్యుల ఆధ్వర్యంలో హనుమాన్ గుడి పరిసరాల్లో మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామ భద్రత మరింత మెరుగుపడాలనే ఉద్దేశంతో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎస్సై సిరిసిల్ల అశోక్ సీసీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడుతూ,గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడటంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. నేరాలను అరికట్టేందుకు,అనుమానాస్పద ఘటనలను గుర్తించేందుకు ఇవి దోహదపడతాయని చెప్పారు. గ్రామ ప్రజలు పోలీస్ శాఖకు సహకరిస్తూ గ్రామాన్ని సురక్షితంగా ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన వార్డు సభ్యుడు నూకల శ్రీశైలాన్ని ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్తో పాటు ప్రజా ప్రతినిధులు,గ్రామ పెద్దలు అభినందించారు. గ్రామ అభివృద్ధి,భద్రత దిశగా తీసుకున్న ఈ చర్యపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పోలీస్ అధికారి,పంచాయతీ కార్యదర్శి,గ్రామ సర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు,యువకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పాలిసేట్ టాలెంట్ టెస్ట్ 2026 విజేతలకు బహుమతుల ప్రధానం




**జనవరి 21, మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పాలిసెట్ టాలెంట్ టెస్ట్ 2026 లో జిల్లా లోని సుమారు 35 పాఠశాలలు నుండి 350 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ పాలీసెట్ ఎంట్రెన్స్ టెస్ట్ తరహాలో నిర్వహించిన ఈ పరీక్షలో విజేతలకు హుస్నాబాద్ ఆర్డిఓ వి. రామ్మూర్తి చేతుల మీదుగా బహుమతుల ప్రధానం జరిగినదన్నారు. మాంటిస్సోరి పాఠశాలకు చెందిన జి. రామన్ మొదటి స్థానం సిద్ధార్థ పాఠశాలకు చెందిన రెండవ స్థానం , జెడ్పిహెచ్ఎస్ బాలుర పాఠశాల విద్యార్థి నాగచైతన్యకు మూడో స్థానం సాధించడం జరిగినదన్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను ప్రభుత్వ పాలిటెక్నిక్ హుస్నాబాద్ నుండి బహుకరించారు. పరీక్షలో పాల్గొన్న అన్ని పాఠశాలల విద్యార్థులకు అభినందనలను పాఠశాల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగిందన్నారు. పరీక్ష కన్వీనర్ గా కళాశాల ప్రిన్సిపాల్ పంచదార శ్రీదేవి పరీక్ష కోఆర్డినేటర్ గా మహమ్మద్ వహీద్, వ్యవహరించారు.

## అమెజాన్ షిప్పింగ్ (ఏటీఎస్) కొంపల్లి పికప్ హబ్‌లో ఘరానా మోసం



**–అల్వాల్‌లో వెలుగులోకి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జనవరి 21 మన వార్త :**ఆన్‌లైన్ షాపింగ్ విస్తృతంగా పెరుగుతున్న నేపథ్యంలో, అదే అవకాశంగా మార్చుకుని కొందరు దుండగులు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా అల్వాల్ ప్రాంతంలో అమెజాన్ షిప్పింగ్ (ఆయా) పేరుతో జరిగిన ఘరానా మోసం వెలుగులోకి వచ్చి స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. అమెజాన్ పార్సల్ డెలివరీ వ్యవస్థను అడ్డం పెట్టుకుని, కొంపల్లి ప్రాంతంలో ఉన్న ఏటీఎస్ పికప్ హబ్ కేంద్రంగా ఈ మోసాలు జరుగుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. విలువైన వస్తువులను మారుస్తూ, అమాయక వ్యాపారులు, వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని లక్షల రూపాయల మోసం జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా మొదలైన మోసం అల్వాల్‌కు చెందిన ఓ షాప్ యజమాని వివరాల ప్రకారం, ఇటీవల ఆయన రూ. 5,000 విలువైన డెనిమ్ జాకెట్‌ను కస్టమర్ ఆర్డర్ మేరకు అమెజాన్ షిప్పింగ్ ద్వారా పంపించారు. ఈ పార్సల్‌ను అమెజాన్ షిప్పింగ్ (ఏటీఎస్) కొంపల్లి పికప్ హబ్‌లో స్వీకరించిన అనంతరం, అందులో ఉన్న అసలు డెనిమ్ జాకెట్‌ను తొలగించి, దాని స్థానంలో మరొక తక్కువ విలువ గల వస్తువును పెట్టి, అదే అడ్రస్‌కు పార్సల్‌ను పంపినట్టు తెలుస్తోంది. పార్సల్ అందుకున్న కస్టమర్ బాక్స్ తెరిచి చూడగా, ఆర్డర్ చేసిన డెనిమ్ జాకెట్ అందులో లేకపోవడంతో వెంటనే షాప్ యజమానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో షాక్‌కు గురైన షాప్ యజమాని అమెజాన్ షిప్పింగ్ అధికారులను సంప్రదించగా, వారు నిర్లక్ష్యంగా, తప్పించుకునే విధంగా మాట్లాడినట్టు ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా బెదిరింపులే ఈ ఘటనపై షాప్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే, అమెజాన్ షిప్పింగ్‌కు సంబంధించిన కొందరు వ్యక్తులు "మీరు పోలీసులకు ఫిర్యాదు చేసినా మాకు ఏమి కాదుడ మీరు ఏం చేసుకుంటే అది చేసుకోండి" అంటూ బెదిరింపు ధోరణిలో సమాధానం ఇచ్చారని బాధితుడు మీడియాకు వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు మరింత అనుమానాలకు తావిస్తున్నాయి. పలు పార్సెల్స్‌లోనూ ఇదే తరహా మోసాలు? ఇదే తరహాలో, ఒకటి ఆర్డర్ చేస్తే మరొక వస్తువును పార్సెల్‌లో పంపించడం, విలువైన వస్తువులను మార్చేయడం వంటి ఘటనలు ఇటీవలి కాలంలో పలుచోట్ల జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంపల్లి పికప్ హబ్ పరిధిలో ఈ మోసాలు వ్యవస్థీకృతంగా జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ఈ ఘటన నేపథ్యంలో, ఆన్‌లైన్ షాపింగ్ చేసే ప్రజలు, వ్యాపారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు. పార్సల్ పంపించే సమయంలో వీడియో రికార్డింగ్, సరైన డాక్యుమెంటేషన్, ట్రాకింగ్ వివరాలు భద్రపరుచుకోవడం అవసరమని సూచిస్తున్నారు. అమెజాన్ యాజమాన్యం, సంబంధిత షిప్పింగ్ విభాగం వెంటనే స్పందించి, కొంపల్లి ఏటీఎస్ పికప్ హబ్‌లో జరుగుతున్న మోసాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పోలీసులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని, మోసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఘనంగా మార్కండేయ జయంతి




**ముస్తాబాద్, మనవార్త జనవరి 21** రాజన్న సిరిసిల్ల ముస్తాబాద్ మండల కేంద్రంలో మార్కండేయ జయంతి వేడుకలు పద్మశాలి సంఘం ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు ముస్తాబాద్ పురవీధుల గుండా స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పద్మశాలి మండల అధ్యక్షుడు గూడూరు భరత్, అధ్యక్షుడు తడక బాలకిషన్, ఉపాధ్యక్షుడు గౌడ కృష్ణ హరి బిట్ల దేవానందం, తాడక ప్రభాకర్ సంఘ సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సమసమాజ స్థాపన కోసం జర్నలిస్టులు అనునిత్యం కృషి చేయాలి

**–దోపిడీ పెరిగిపోయినప్పుడు జర్నలిస్టులు వాటిపై అక్షర యుద్ధం చెయ్యాలి...**
**–వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటేనే పాత్రికేయరంగంలో గుర్తింపు...**
**–మన వార్త క్యాలెండర్ ఆవిష్కరణలో తాహశిల్దార్ రాళ్ల బండి రాంబాబు...**

**మధిర, జనవరి 21( మన వార్త),:**జర్నలిస్టులు ప్రజలకు,ప్రభుత్వానికి వారధులుగా పనిచేయాలని మధిర తాహశిల్దార్ రాళ్ల బండి రాంబాబు అన్నారు. బుధవారం మన వార్త పత్రిక క్యాలెండర్ ను ఆ పత్రిక మధిర ఆర్ సి ఇంచార్జ్ వేల్పుల రామారావుతో కలిసి



తాహశిల్దార్ రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,జర్నలిస్టు వృత్తి ఎంతో విలువలతో కూడినదని,సమసమాజ స్థాపన కోసం జర్నలిస్టులు అనునిత్యం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పరిపాలనలో లోటుపాట్లు జరిగినప్పుడు,దోపిడీ పెరిగిపోయినప్పుడు జర్నలిస్టులు వాటిపై అక్షర యుద్ధం చేయాలని, వ్యవస్థను,వ్యక్తులను గాడిలో పెట్టేందుకు కృషి చేయాలన్నారు. మారుతున్న కాలనుగునంగా జర్నలిస్టు వృత్తిలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, వృత్తి నియమాలను పాటిస్తూ విషయ పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంచుకుంటూ నైపుణ్యతను ప్రదర్శించాలన్నారు. అనునిత్యం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులు ఆరోగ్యాల పట్ల,కుటుంబాల పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మధిర ప్రధాన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పాగి పాలస్వామి,పల్లపోతు ప్రసాదరావు,సుంకర సీతారాం,తలారి రమేష్, పసుపులేటి శ్రీనివాసరావు, వేముల నవీన్ కుమార్, దుబాసి రాజేష్,కందుకూరి నరేష్,చల్లా శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## రోడ్డు భద్రతానియమాలను పాటించాలి..




**–పెబ్బేరు ఎస్ఐ యుగంధర్ రెడ్డి...**

**పెబ్బేరు.జనవరి21 ( మన వార్త ప్రతినిధి)**ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని హెల్మెట్ ధరించి వాహనం నడపాలని లేదంటే మూల్యం చెల్లించుకోవల్సి వస్తుందని పెబ్బేరు ఎస్ఐ యుగంధర్ రెడ్డి హెచ్చరించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ పై 10 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు బుధవారం పెబ్బేరు పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో తెలిపారు. జర్నలిస్టులకు, టూవీలర్లకు సైతం రోడ్డు భద్రతా మాసోత్సవాలు, ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పెబ్బేరుకు వచ్చేవారు కాని,ఇక్కడి నుంచి హైవేల మీదుగా వేరే ప్రాంతాలకు వెళ్లే టూవీలర్స్ వారు తప్పనిసరి హెల్మెట్ పెట్టుకోవాలని,అదేవిధంగా కార్లలో ప్రయాణించే డ్రైవర్లు సీట్ బెల్టు పెట్టుకోవాల్సిందేనని సూచించారు. అప్పుడే ప్రమాదాలను నివారించడానికి వీలుంటుందని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే మాత్రం తల్లదండ్రులకు శిక్ష తప్పదని,ఎలక్ట్రిక్ వెహికిల్స్ స్పీడ్ తక్కువగా వెళ్లాలని,డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరి అని చెప్పారు. రూల్స్ మీరితే ఫైన్లు, కేసులు వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో 2వ ఎస్ఐ దివ్యా రెడ్డి,ఏఎస్సై శ్రీనివాస్ గౌడ్,శ్రీనివాసులు,హెడ్ కానిస్టేబుల్ నరసింహా,ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్, జర్నలిస్టులు,టూవీలర్లు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం..



**–బీజేపీ నాయకులు...**

**పెబ్బేరు.జనవరి21 (మన వార్త ప్రతినిధి)** బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ ఎన్నికైన సందర్భంగా పెబ్బేరు పట్టణంలో బీజేపీ నాయకులు బుధవారం స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు కావలి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. నితిన్ నబిన్ సారథ్యంలో మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధిస్తుందని నేతలు రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గౌని వేమారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో పెబ్బేరు మున్సిపాలిటీని కైవసం చేసుకుంటామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేంద్ర గౌడ్,జిల్లా అధికార ప్రతినిధి కంచ ఆంజనేయులు,జిల్లా కౌన్సిల్ సభ్యులు రంగస్వామి గౌడ్, సీనియర్ నాయకులు కార్తీక్ చారి,గోనెల అరవింద్,శీను, చింతకాయల నరేష్ తదితరులు పాల్గొన్నారు

## 108 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి




**-జిల్లా మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్...**

**శంకరపట్నం:జనవరి21(మనవార్త ప్రతినిధి)** 108 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్ అన్నారు. శంకరపట్నం మండలం కేశవపట్నం108 అంబులెన్స్ ను బుధవారం 108 జిల్లా మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్ లో ఉన్న వైద్య పరికరాలు మరియు రికార్డులు, ఔషధాలను పరిశీలించారు. ప్రజలకు అంబులెన్స్ ఎప్పుడు అందుబాటులో ఉండాలని మరియు క్షతగాత్రులను తరలించే సమయంలో ప్రథమ చికిత్స తప్పనిసరిగా అందించాలని సిబ్బందికి సూచించారు. అంబులెన్స్ లో ఆక్సిజన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సిబ్బందికి చెప్పారు. కేశవపట్నం అంబులెన్స్ సిబ్బంది పనితీరు పట్ల ఇమ్రాన్ హర్షం వ్యక్తం చేశారు. అంకిత భావంతో పనిచేసే ప్రతి వ్యక్తికి గుర్తింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది ఈఎంటి గూడూరి సతీష్ రెడ్డి, పైలెట్ ఖాజా ఖలీల్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలి...



**-పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు...**

**పెబ్బేరు. జనవరి21 (మన వార్త ప్రతినిధి)** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, డిసిసి అధ్యక్షుడు శివ సేనారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మహాత్మాగాంధీ పేరుతో ఉన్న చట్టాన్ని వికసిత్ భారత్ జీరామ్‌జీ పథకంగా అమలు చేయడం సరికాదని పెబ్బేరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ...గ్రామీణ పేదలకు తీవ్రనష్టం కలిగించే జీరామ్‌జీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి 200 రోజులు పనిదినాలు కల్పించి కేంద్ర బడ్జెట్‌లో రెండున్నర లక్షల కోట్లు కేటాయించి పేదలను ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం మానుకోవాలని దేశానికి స్వాతంత్రం సిద్ధింప చేసిన మహానత వ్యక్తి మాత్మ గాంధీ అని వారి పేరు ముమ్మాటికి కొనసాగించాలని లేకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, జిల్లా యువజన నాయకులు రంజిత్ కుమార్, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మండల సీనియర్ నాయకులు సురేందర్ గౌడ్, యుగేందర్ రెడ్డి, బురమోని రాములు యాదవ్, మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్, మండల యూత్ అధ్యక్షులు రాజేష్, వీరస్వామి నాయుడు, ఎస్సీ సెల్ మండల నాయకులు వెంకటేష్, వినయ్, సత్య నారాయణ రెడ్డి, భగవంతు, బాలగౌడ్, మల్లేష్ యాదవ్, నిరంజన్ రెడ్డి, రాఘవేంద్ర, భానుప్రకాష్ రెడ్డి, రాజగౌడ్, రంగం నరసింహ, బాలరాజు, ఉత్తమ్, సత్యనారాయణ రెడ్డి, రణధీర్ రెడ్డి, దాసరి రాముడు, నరేష్ రెడ్డి, శివసాయి, తాటికొండ, భాను, కృష్ణ, వినోద్, బాలరాజు, వెంకట్రాములు యాదవ్, రాముడు తదితరులు పాల్గొన్నారు

## రైతు రక్షణ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

**-అభినందించిన అడిషనల్ కలెక్టర్ రవికుమార్...**

**ఎల్కతుర్తి జనవరి 21 మన వార్త ప్రతినిధి** రైతుల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేస్తున్న టీఆర్ఆర్ఎస్( తెలంగాణ రైతు రక్షణ సమితి) ని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్ .రవికుమార్ అభినందించారు. బుధవారం రైతు రక్షణ సమితి నాయకులతో కలిసి ఆయన తమ ఆఫీసులో రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన -2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ హింగే, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు హింగే రవీందర్, జిల్లా సహాయ కార్యదర్శి అంబీరు శ్రీనివాస్, ఎల్కతుర్తి మండల ప్రధాన కార్యదర్శి కె మాధవరావు, పరకాల అధ్యక్షుడు మధుకర్ పాల్గొన్నారు.



## మద్యం సేవించి వాహనాన్ని నడిపిన 05 మందికి 50,500/- రూపాయల జరిమానా



**సిద్దిపేట జిల్లా, జనవరి 21, మన వార్త ప్రతినిధి** సిద్ధిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, సిబ్బందితో గత కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ చేయగా, 05 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా బుధవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి ముందు హాజరుపరచగా విచారణ చేసి 05 మందికి ₹50,500/- రూపాయల జరిమాన విధించారు 'డ్రైవింగ్ లైసెన్లేని 01 ఒకరికి ఐదు వేల జరిమానా విధించారు' ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ కుమార్, మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడవదని, డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుపడ్డ వాళ్ల కి పదివేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించే వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



**సిద్దిపేట జిల్లా,జనవరి 21, మన వార్త ప్రతినిధి** సిద్దిపేట 2వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తిని కోర్టులో హాజరుపరిచారు. ఈ విచారణలో భాగంగా కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. 'నిందితుడికి జైలు శిక్ష' కదిరి మహేష్,అనే వ్యక్తి గతంలో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డారు. అప్పట్లో కోర్టు విధించిన చలానాను చెల్లించకపోవడమే కాకుండా, మళ్ళీ రెండోసారి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. దీనిని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం అతనికి 5 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. నేడు మొత్తం 04 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో నిందితులకు కలిపి మొత్తం రూ. 31,000 జరిమానా విధించడం జరిగింది. ఈ సందర్భంగా సిద్దిపేట టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ మాట్లాడుతూ. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని, చలానాలు సకాలంలో చెల్లించాలని సూచించారు.

## పేదవారి ఆత్మగౌరవ ప్రతీక ఇందిరమ్మ ఇల్లు- ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్లు పూర్తి చేసుకోవాలి



**వేములవాడ జనవరి 21 (మన వార్త)** పేదవారి ఆత్మగౌరవ ప్రతీక ఇందిరమ్మ ఇల్లు అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.. బుధవారం వేములవాడ పట్టణంలోని ఇస్లాం నగర్ లో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం 10 లక్షల్లతో శంకుస్థాపన ,మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మోడల్ ఇందిరమ్మ ఇల్లు ను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వేములవాడ రూరల్ మండల పరిధిలోని 29 కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం ధ్యేయంగా ముందుకు పోతుందని అన్నారు.. ఇప్పటికే నిర్మాణలు శరవేగంగా జరుగుతున్నాయి తెలిపారు. గ్రామాల్లో ఆనాడు కాంగ్రెస్ ఇచ్చిన ఇందిరమ్మ ఇల్లే తప్ప గత పది సంవత్సరాలలో గత ప్రభుత్వం ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కూడా కట్టించలేదని విమర్శించారు. రాష్ట్రంలోని ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు చూపిస్తే మేము ఓట్లు అడగం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేని ఊరు మేం చూపిస్తాము మీరు ఓట్లు అడగకుండా ఉండాలి అని సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో మేం చేసిన సవాలను స్వీకరించలేదని పేర్కొన్నారు. అలాగే వేములవాడ పట్టణంలో ముస్లింలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న షాదీ ఖానా అసంపూర్తి భవన నిర్మాణానికి 80 లక్షల రూపాయలు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించామని వెల్లడించారు. మురుగు నీరు గుడి చెరువులో, మూలవాగులో కలవకుండా నివారించేందుకు 10 కోట్ల రూపాయలతో ప్రత్యేక మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నా యన్నారు. గంగమ్మ తల్లి దేవాలయానికి వెళ్లే మార్గంలో బ్రిడ్జి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న గంగపుత్రులకు ఇచ్చిన హామీ మేరకు 80 లక్షల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు.

## ఫుట్‌పాత్ విస్తరణ పనులు ప్రారంభం- ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలో జేసీబీతో తొలగింపులు




**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జనవరి 21 మన వార్త :** అల్వాల్ సర్కిల్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలో ఫుట్‌పాత్ విస్తరణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎసిపి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రవళి, ప్రశాంతి, మహమ్మద్ అఫ్రోజ్ ఖాన్, అప్సర్ బాబా, జిహెచ్ఎంసి సిబ్బంది జేసీబీ సహాయంతో ఫుట్‌పాత్‌పై ఉన్న అడ్డంకులు, అక్రమంగా ఏర్పాటు చేసిన నిర్మాణాలను తొలగించారు. ప్రధాన రహదారిపై పాదచారులకు నడవడానికి ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో, ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఇందిరాగాంధీ విగ్రహం పరిసర ప్రాంతంలో వాహన రద్దీ అధికంగా ఉండటంతో ప్రమాదాలను నివారించేందుకు ఫుట్‌పాత్ విస్తరణ అవసరమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఎసిపి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా ఫుట్‌పాత్‌లు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగర సుందరీకరణతో పాటు ప్రజల భద్రతే లక్ష్యంగా ఇలాంటి చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఫుట్‌పాత్ విస్తరణ పూర్తయితే పాదచారులకు సౌకర్యవంతమైన మార్గం అందుబాటులోకి రానుందని, ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## జాగన్మాత ఆలయం పరిసరాల్లో సీవరేజ్ సమస్యపై కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి తనిఖీ



**-త్వరిత చర్యలకు అధికారులకు ఆదేశాలు...**


**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, జనవరి 21 మన వార్త :** అల్వాల్ డివిజన్ లోని జాగన్మాత ఆలయం, ఓల్డ్ గాబ్రియేల్ స్కూల్, వెంకట్రావుపేట పరిసర ప్రాంతాల్లో తరచూ సీవరేజ్ బ్లాకేజ్‌లు, మురుగు నీటి ఉప్పెనలపై స్థానికులు చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ తనిఖీలో హెచ్ఎంఎస్‌డబ్ల్యుఎస్‌బి మేనేజర్ చారి, అలాగే అధికారులు శేఖర్, అరుణ, ప్రేమ్, సెంటిల్, అరుణ్, సెల్వరాజ్, రామానుజం, అముల్, అరవింద్, సాజిద్, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అధికారులు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, సీవరేజ్ పైపులలో ఏర్పడిన అడ్డంకులను గుర్తించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సీవరేజ్ బ్లాకేజ్‌ల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మురుగు నీటి ఉప్పెనల కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అన్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని, యుద్ధప్రాతిపదికన సీవరేజ్ శుభ్రపరిచే పనులు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. స్థానికులు కూడా సీవరేజ్ లైన్లలో వ్యర్థాలు వేయకుండా సహకరించాలని కోరారు. కార్పొరేటర్ తక్షణ స్పందనతో సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించడంపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## రాజన్న కోడెలను సంరక్షించాలి



**వేములవాడ, జనవరి - 21 (మన వార్త)** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి గోశాలల నుంచి కోడెలను తీసుకువెళ్ళే రైతులు వాటిని సంరక్షించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో అర్హులైన రైతులకు బుధవారం 103 జతల కోడెలను ఉచితంగా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై రైతులకు అందజేశారు. వ్యవసాయ భూమి ఉందా? ఇప్పటికే పశువులు ఉన్నాయా అని పలువురు రైతులను ఇంచార్జి కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. కోడెల కోసం ప్రకటన జారీ చేశామని, ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానించామని తెలిపారు. గత, ప్రస్తుత ఆన్లైన్ దరఖాస్తులు మొత్తం 238 ఉన్నాయని వెల్లడించారు. రెవెన్యూ, వ్యవసాయ, పశు సంవర్ధక, ఆలయ అధికారులు దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించామని తెలిపారు. ఆన్లైన్ లో అన్ని పత్రాలతో దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలు మరోసారి తనిఖీ చేసిన తరువాతే కోడెలను పంపిణీ చేశామని తెలిపారు. రైతులకు తిప్పాపూర్ గోశాలలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి కోడెలను రాజన్న ప్రసాదంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వాటికి గడ్డి, దాణా అందజేస్తూ సంరక్షించాలని సూచించారు. పంపిణీ చేసిన కోడెలను వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ అధికారులతో తనిఖీ చేయిస్తామని స్పష్టం చేశారు. కోడెలను పక్కదారి పట్టించి ఇతర అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆలయ ఈఓ రమాదేవి, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు, గోశాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి చేతుల మీదుగా సీడీ ఆవిష్కరణ



**శంకరపట్నం:జనవరి21(మనవార్త ప్రతినిధి)** తెలంగాణ జన సమితి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మోరె గణేష్ పేరు మీద పాడిన పాట సీడీని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. టీజేఎస్ జిల్లా అధ్యక్షులు వెలుగునీడ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మోరే గణేష్ కుమారుడు రితీష్ పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేసి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి నరేందర్ రెడ్డి సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ,,మోరే గణేష్ ప్రజలకు అందుబాటులో ఉంటూ రాజకీయ నాయకుడిగా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు దగ్గరవుతున్నారని మోరె గణేష్ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, బీసీ ఆజాద్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్, బీఆర్ఎస్ యువనేత గవ్వం వంశీధర్ రెడ్డి, మొలంగూర్ ఉప సర్పంచ్ దండు రాజేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంట తిరుపతి రెడ్డి, పెంట సాంబయ్య, చీకట్ల శ్రీనివాస్, యువజన సమితి మండల అధ్యక్షులు కొంకటి అంజి, మోరె అజయ్, శ్రీకాంత్, నెలవేని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## దెందుకూరు లో ఘనంగా ప్రారంభమైన చీఫ్ మినిస్టర్ కప్

**-క్రీడలను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు...**

**మధిర, జనవరి21( మన వార్త):**గ్రామీణ ప్రాంతంలో ప్రతిభ క్రీడాకారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన సీఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా మధిర మండలంలోని




దెందుకూరు ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో పోటీలు క్లస్టర్ స్థాయిలో పోటీలు ప్రారంభించడం జరిగిందని దెందుకూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఎం. రాజకుమారి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రామసర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడల వలన మానసిక ఉల్లాసంతో పాటు చక్కని ఆరోగ్యం, శారీరక దృఢత్వం సొంతం చేసుకోవచ్చని, ప్రతిరోజు క్రీడలకు కొంత సమయం కేటాయించినట్లయితే సంపూర్ణ ఆరోగ్యతో పాటు మానసిక పటుత్వం సాధించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ నిర్వహించడం అభినందనీయమని తెలియజేస్తూ క్లస్టర్ స్థాయిలో రాణించిన చిన్నారులు మండల స్థాయిలో కూడా చక్కగా ఆడుతూ జిల్లా స్థాయి కి వెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఎం.రాజకుమారి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమని, క్రీడల ద్వారా ఏకాగ్రత మెరుగవుతుందని తెలిపారు. క్రీడలు నిర్వహణలో భాగంగా బాలుర సీనియర్స్,జూనియర్స్ విభాగం నందు.. వాలీబాల్ ప్రథమ బహుమతి - జడ్పిహెచ్ఎస్ దెందుకూరు ద్వితీయ బహుమతి - జడ్పిహెచ్ఎస్ దెందుకూరు బాలికల సీనియర్స్,జూనియర్స్ విభాగం నందు... ప్రథమ బహుమతి - జడ్పిహెచ్ఎస్ దెందుకూరు ద్వితీయ బహుమతి - జడ్.పి.హెచ్.ఎస్ దెందుకూరు. సీనియర్స్ కబడ్డీ బాలురు విభాగంలో కూడా దెందుకూరు ప్రథమ బహుమతి సాధించింది. అలాగే కోకో బాలురు బాలికల విభాగంలో కూడా ప్రథమ బహుమతి జడ్పీహెచ్ఎస్ దెందుకూరు సాధించింది. గెలుపొందిన వారికి ఈ నెల 28న మధిరలో మండల స్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని క్రీడల కార్యదర్శి, దెందుకూరు ఉన్నత పాఠశాల పి డి వై చిన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కామేశ్వరి, గ్రామ ఉపసర్పంచ్ రాయల ఝాన్సీ , గ్రామ కార్యదర్శి భాస్కర్ ,రాయల ప్రసాద్ , గ్రామ పెద్దలు ఐతం ప్రసాద్ , చావా వేణు ,ఆర్ వి , గంగ రాజు , రాంబాబు , ఇతర గ్రామ పెద్దలు,దెందుకూరు పాఠశాల ఉపాధ్యాయ బృందం, వివిధ పాఠశాల క్రీడాకారులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి పనుల కోసం స్టోన్ పరిశీలన....




**వేములవాడ జనవరి 21 (మన వార్త)**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో చేపడుతున్న అభివృద్ధి పనులలో భాగంగా, బుధవారం నిర్మాణానికి వినియోగించనున్న స్టోన్‌ను పరిశీలించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఎం.ఎస్. శంకర్ (సివిల్ ఇంజనీర్), లిపీ. గణేశన్ (స్థపతి)లతో పాటు కాంట్రాక్టర్ జగన్ మోహన్ రెడ్డి బృందం పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కోటప్పకొండ ,బల్లికుర్వ ప్రాంతానికి వెళ్లి అక్కడి నుంచి తీసుకురానున్న స్టోన్ నాణ్యతను పరిశీలించారు.ఆలయ అభివృద్ధి పనులు అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో చేపట్టే ఉద్దేశంతో, ఈ స్టోన్ నమూనాలను ఐఐటి చెన్నైకు పంపించి నాణ్యత పరీక్షలు (టెస్టులు) నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

## మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్టులో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**శంకరపట్నం:జనవరి21(మన వార్త ప్రతినిధి)** శంకరపట్నం మండల కేంద్రంలోని జడ్పీఎస్ హెచ్ పాఠశాలలో బుధవారం మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి విద్యార్థినీ,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సోషల్ టాలెంట్ టెస్ట్‌లో మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటి ప్రథమ,ద్వితీయ స్థానాలను కైవసం చేసుకుని ప్రత్యేక గుర్తింపు పొందారు. మోడల్ స్కూల్ 10వ తరగతికి చెందిన విద్యార్థిని సిరి చందన ప్రథమ స్థానం సాధించగా,మరో విద్యార్థిని మనస్విని ద్వితీయ స్థానంలో నిలిచారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాధికారి లక్ష్మీ నారాయణ చేతుల మీదుగా విజేత విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,,మండల స్థాయిలో ఈ సోషల్ టాలెంట్ టెస్ట్‌ను విజయవంతంగా నిర్వహించిన అన్ని పాఠశాలల సోషల్ ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల్లో సామాజిక అవగాహన పెంపొందించడంలో సోషల్ సబ్జెక్ట్ కీలక పాత్ర పోషిస్తుందని,ఇది వారి జీవన విలువల వికాసానికి,భవిష్యత్ జీవిత ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సోషల్ ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత అందరిది



**జహీరాబాద్, జనవరి 21 (మన వార్త):** రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత అందరిపై ఉందని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ అన్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో స్థానిక పోలీస్ అధికారులు అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళా సంఘాలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముందుగా ఆయా ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల వీడియోలను వేదిక పై ఏర్పాటు చేసిన స్క్రీన్ పై ప్రదర్శించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించక అనేక మంది వాహన చోదకులు ప్రమాదాలకు గురి అయి ప్రాణాలు కోల్పోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సిట్ బెల్ట్ ధరించాలని, ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులు ప్రయాణించరాదని, గూడ్స్ వాహనాల్లో పరిమితికి మించి వస్తువులు రవాణా చేయకూడదని, వాహనాలకు అకస్మాత్తుగా బ్రేక్ వేయకూడదని వివరించారు. జీవితం విలువైనదని నిర్లక్ష్యం వహించి ప్రాణాలు కోల్పోవద్దని హితవు పలికారు. ఎప్పటికప్పుడు వాహనాల టైర్లు సరి చూసుకోవాలని, వాహన ధృవ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరి వెంట పెట్టుకోవాలన్నారు. మైనర్ పిల్లలు వాహనాలు నడపడం నేరమని, బైక్ పై స్త్రీలు కూర్చున్నప్పుడు చక్రాలలో దుస్తులు చిక్కుకోకుండా జాగ్రత్త వహించాలన్నారు. జహీరాబాద్ డిఎస్పీ సైదా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జహీరాబాద్ న్యాయమూర్తి కవితా దేవి, ఆర్డీఓ, తహశీల్దారు దశరథ్ లు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. జహీరాబాద్ పట్టణ, రూరల్ సీఐ లు శివలింగం, జక్కుల హనుమంతు, మోటారు వెహికిల్ ఇన్స్పెక్టర్ వెంకయ్య, ఎస్ఐ లు కె వినయ్ కుమార్, కాశీనాథ్, రాజేందర్ రెడ్డి, నరేష్, డి సుజిత్, పి క్రాంతికుమార్, చైతన్య కిరణ్, ఏ ఎస్ఐ లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు సభ విజయవంతానికి కృషి చేశారు. రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేసి సభ కార్యక్రమాన్ని ముగించారు.

## కమ్యూనిస్టుగానే బ్రతకాలనే తపనతో జీవించిన వ్యక్తి సంపసాల నాగభూషి



**-కమ్యూనిస్టులు మరణించిన ప్రజల హృదయాలలో జీవించి ఉంటారు...**
**-నాగభూషి మరణం సిపిఐకి తీరని లోటు...**
**-నివాళులర్పించిన నేతలు బెజవాడ రవిబాబు -మందడపు రాణి...**

**మధిర,జనవరి 21(మన వార్త):**మూడు దశాబ్దాల కమ్యూనిస్టు ఉద్యమాల్లో కామ్రేడ్ సంపసాల నాగభూషి కీలకంగా నిలిచారని ఆయన మరణం సిపిఐకి తీరని లోటు అని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు మందడపు రాణి అన్నారు.మధిర మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన సీనియర్ కామ్రేడ్ సంపసాల నాగభూషి (50)బుధవారం మృతి చెందారు.ఆయన మృతి వార్త తెలుసుకున్న మధిర మండల సిపిఐ నాయకత్వం బెజవాడ రవిబాబు,మందడపు రాణి మల్లారం గ్రామంలో ఉంచిన సంపసాల నాగభూషీ పార్థివ దేహాన్ని సందర్శించి పార్థివ దేహం పై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,కార్మిక హక్కుల సాధన కోసం పార్టీ సమరశీల పోరాటాలు కొనసాగించిన ప్రతి ఉద్యమంలో నాగభూషి ఉన్నారని ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటుగా భావిస్తున్నామని అన్నారు.కమ్యూనిస్టుగానే బతకాలనే తపన నాగభూషిదని ఆయన ఏనాడు ఎర్రజెండాను వదిలిపెట్టలేదన్నారు.సంపసాల పార్దేవ దేహం వద్ద మల్లారం గ్రామ సిపిఐ కార్యకర్తలు,నాయకులు నివాళులర్పించారు.

## హెల్మెట్ లేనిదే పెట్రోల్ లేదు.....




**-ఎస్సై సిహెచ్ గణేష్....**

**ముస్తాబాద్, మన వార్త జనవరి 21** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో బుధవారం నాడు ఎస్సై సిహెచ్ గణేష్ హెల్మెట్ లేకుండా పెట్రోల్ పోయవద్దని ముస్తాబాద్ లో హెచ్ పి పెట్రోల్ బంకును సందర్శించి ప్రమాదాలు జరుగుతున్నందున పెట్రోల్ పోయవద్దని తెలిపారు. ఈ సందర్భంగా నో హెల్మెట్ నో పెట్రోల్ అని తెలిపారు. పెట్రోల్ పంపు సిబ్బందికి మరియు ప్రయాణికులకు చెప్పడం జరిగింది హెల్మెట్ ధరించడం వలన ఏ ప్రమాదాలు జరగకుండా ఉంటాయని నో హెల్మెట్ నో పెట్రోల్ అనే కాన్సెప్ట్ను గురించి పెట్రోల్ పంప్ సిబ్బంది మరియు ప్రయాణికులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ పి పెట్రోల్ బంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 29 నుంచి శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



**కల్వకుర్తి జనవరి 21 మన వార్త ప్రతినిధి** గ్రామ పెద్దల సమీక్ష సమావేశం ఆలయంలో బ్రహ్మోత్సవాల కరపత్రం విడుదల కడ్తాల పట్టణంలోని శ్రీశ్రీశ్రీ లక్ష్మి నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు గ్రామ పెద్దలు డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, సర్పంచ్ బిక్షపతి,రాలే కమిటీ అధ్యక్షుడుపాలాదిఆంజనేయులు,ఉత్సవ పర్యవేక్షకులు మేల్లూరి వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆలయంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై చర్చించారు.ప్రతి ఏటా నిర్వహించే ఏర్పాట్లు ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.ఈనెల29నుంచి వోచ్చేనెల 3వ తేదీ వరకు ఆరు రోజులపాటు వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు.ఈసందర్భంగా చుట్టుపక్కల గ్రామాలనుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయంలోప్రత్యేకంగాఏర్పాట్లుచేయడంతో పాటు విద్యుత్ దీపాలంకరణ చేసి ఆలయాన్ని సర్వాంగసుందరంగాముస్తాబు



చేయనున్నారు. ఈనెల 29న విగ్నేశ్వరపూజఅఖండదీపారాధనధ్వజరోహణముఅంకురార్పణకార్యక్రమాలుఉంటాయని తెలిపారు. 30 న స్వామివారికి ఎదురు కోళ్ల కార్యక్రమం 31న స్వామివారి కల్యాణోత్సవం పుష్పమాల సేవ రథోత్సవము చిన్నతేరు శివాలయం దగ్గర అగ్నిగుండంవంటికార్యక్రమాలునిర్వహించడంజరుగుతుందనితెలిపారు. 1నకుంకుమార్చన అగ్ని ప్రతిష్ట పెద్దతేరు 2 న హనుమాన్ చాలీసాపారాయణంధోపోత్సవం 3నకుంకుమార్చన ప్రత్యేక పూజలుచక్రతీర్థం గరుడసేవ ఊరేగింపు నాగవల్లి కార్యక్రమం తో కార్యక్రమాలు ముగియడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదం స్వీకరించాలని వారు కోరారు.

## యువత కోరిక నెరవేర్చిన ఉపసర్పంచ్...



**-కబడ్డీ కోర్టు కోసం మూడవ వార్డులో మట్టి పోయింపు...**

**ఇల్లంతకుంట,జనవరి 21 (మన వార్త ప్రతినిధి);**ఇల్లంతకుంట మండల కేంద్రంలోని మూడవ వార్డులో కబడ్డీ కోర్టు ఏర్పాటు కోసం గంగాధర క్షేత్ర వ్యవస్థాపకులు దామోదర శర్మ జ్ఞాపకార్థంగా ఉపసర్పంచ్ మూగు నాగరాజ్ శర్మ తన సొంత ఖర్చులతో ట్రాక్టర్ల ద్వారా మట్టి కుప్పలను పోయించారు.మూడవ వార్డులోని యువకులు కబడ్డీ కోర్టు ఏర్పాటు చేయాలని ఉపసర్పంచ్ రాజు శర్మను కోరగా,వారి విజ్ఞప్తికి వెంటనే స్పందించిన ఆయన కోర్టు ఏర్పాటుకు అవసరమైన మట్టిని అందించి స్థలాన్ని సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఐదవ వార్డు సభ్యులు మామిడి సుశీల,మామిడి రాజు,అంగన్వాడీ టీచర్ బైరి అరుణ,నార్ల దినేష్,మామిడి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి జన్మదిన వేడుకలు...



**-శుభాకాంక్షలు తెలిపిన భువనగిరి మండల రేషన్ డీలర్ల అధ్యక్షులు గంగాదేవి మహేష్...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి జనవరి 21** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర రేషన్ డీలర్ల జాయింట్ సెక్రెటరీ , భువనగిరి మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు గంగాదేవి మహేష్ ఆధ్వర్యంలో బుధవారం రోజు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల నారాయణ రెడ్డి , రాసాల వెంకటేష్ , అంకర్ల కిషన్ ఇతర రేషన్ డీలర్లు పాల్గొనడం జరిగింది.

## ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్ రద్దు...



**-నెడోక ప్రకటనలో తెలిపిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి జనవరి 21** ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్ , ఉద్యోగవాణి కార్యక్రమం తేది 22.01.2026 రద్దు చేయడం జరిగిందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు నేడొక ప్రకటనలో తెలిపారు. తేది 22.01.2026న గురువారం నిర్వహించే గ్రీవెన్స్ , ఉద్యోగవాణి కార్యక్రమం ఉండదని , ప్రజలు , ఉద్యోగులు వారి యొక్క సమస్యల పై దరఖాస్తులను ఇచ్చేందుకు రావద్దని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## గజ్వేల్‌లో ఘనంగా శ్రీ మార్కండేయ జయంతి ఉత్సవాలు



**గజ్వేల్ జనవరి 21 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీ మార్కండేయ జయంతి ఉత్సవాలను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా స్థానిక మార్కండేయ ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో అటవీ అభివృద్ధి సంస్థ (ఎఫ్డీసీ) మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దుర్గాప్రసాద్, పద్మశాలి సంఘం ప్రతినిధులు, సంఘం నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు వంటేరు ప్రతాప్ రెడ్డిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు

## గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గా వెంకట గోపాల్



**గజ్వేల్ జనవరి 21 మన వార్త ప్రతినిధి** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గా వెంకట గోపాల్ నియమితులయ్యారు. జిహెచ్ఎంసిలో పనిచేస్తున్న ఆయనను ఎన్నికల బదిలీలో భాగంగా ప్రభుత్వం బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించారు., గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉన్న సందర్భంగా పలువురు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గా వెంకట గోపాల్ ఇక్కడకు బదిలీ పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు

## ఇల్లంతకుంట మండల స్థాయిలో సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహణ

**-ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానం...**

**ఇల్లంతకుంట,జనవరి 21( మన వార్త ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని



ఎం.ఆర్.సి.లో తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇల్లంతకుంట మండల ఎంఈఓ శ్రీ శ్రీనివాస్ గౌడ్, పెద్ద లింగాపూర్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ బోయిన తిరుపతి,సోషల్ ఫోరం ఇల్లంతకుంట మండల అధ్యక్షులు పి.అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి కొండా రమేష్,సీనియర్ సోషల్ ఉపాధ్యాయులు వీరారెడ్డి, పద్మా మేడం,రాజి రెడ్డి కొమురయ్య, కుదుస్ వివిధ మండలాలలోని వివిధ పాఠశాలల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ పోటీల్లో మొదటి కేటగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతి: వి.స్వాతి (జడ్.పి.హెచ్.ఎస్ పెద్ద లింగాపూర్),ద్వితీయ బహుమతి: బి.వర్షిని (జడ్.పి.హెచ్.ఎస్ రేపాక),తృతీయ బహుమతి ఆర్.శ్రీవాణి (జెడ్. పి హెచ్ ఎస్ గాలిపెల్లి)కైవసం చేసుకోవడం జరిగింది. రెండో కేటగిరి మోడల్ స్కూల్స్ అండ్ రెసిడెన్షియల్ విభాగంలో మొదటి బహుమతి: ఎన్ మహిత,ద్వితీయ బహుమతి ఎం.హర్షిని,తృతీయ బహుమతి జి అఖిల,(టి జి ఎం ఎస్ రహీం ఖాన్ పెట్ )విద్యార్థులు గెలుపొందడం జరిగింది. విద్యార్థిని,విద్యార్థులకు ఎంఈఓ చెప్యాల శ్రీనివాస్ గౌడ్, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ బోయిని తిరుపతి, సోషల్ టీచర్స్ శుభాకాంక్షలు తెలపడం జరిగింది.ఇలాగే ముందు ముందు ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులను ఆకాంక్షించారు.

## బాలకార్మికులను పనులలో పెట్టుకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటాం ...

**-స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ , రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి జనవరి 21** బాలకార్మికులను పనులలో పెట్టుకుంటే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మరియు



రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. బుధవారం రోజు మినీ మీటింగ్ హాల్ లో బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన ఆపరేషన్ స్మైల్ సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో అదనపు కలెక్టర్ , అడిషనల్ డి సి పి లక్ష్మి నారాయణ , జిల్లా సంక్షేమ అధికారి నర్సింంహారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లడుతూ 0 నుండి 18 సంవత్సరాల లోపు పిల్లలు ఎక్కడ పని చేసిన , వెట్టి చాకిరీ చేయించిన వారి పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. జనవరి నుండి 97 మంది పిల్లలను రెస్క్యూ చేయటం జరిగిందని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ లో అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. అధికారులు వృత్తిపరమైన బాధ్యతగా శ్రద్ధతో పనిచేసి పిల్లల జీవితాల్లో వెలుగులు నింపాలని అన్నారు. పిల్లల సంరక్షణ కొరకు 1098 కు సమాచారం ఇవ్వాలని , ఈ హెల్ప్ లైన్ నంబర్ 24 గంటలు పనిచేస్తుందని తెలిపారు. జిల్లాలో ఆపరేషన్ స్మైల్ కి సంబంధించిన 3 టీం లు 18 సంవత్సరాల లోపు బాల కార్మిక పిల్లలను పని లో పెట్టుకున్నట్లయితే యఫ్ ఆర్ ఐ నమోదు చేసి ఏ-1 గా ఓనర్ ఏ-2 మేస్త్రి , ఏ-3 సంబంధిత పరిశ్రమల సూపర్ వైజర్స్ కేసు లు నమోదు చేయాలని అన్నారు. పరిశ్రమల యజమానులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. పరిశ్రమలు ఎక్కువగా ప్రాంతాలు ఉన్న దగ్గర అంగన్వాడీ సెంటర్ లను ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సి డబ్ల్యూ సి , జే జే బి స్టాఫ్ కమిటీ , బీ ఆర్ బీ కో ఆర్డినేటర్ అనంత లక్ష్మీ , జిల్లా డీఎంఎచ్ఓ అధికారి మనోహర్ , ఏడి ప్రశాంత్ రెడ్డి , పోలీస్ శాఖ సిబ్బంది , ఎన్జీవో ప్రతినిధులు , చైల్డ్ హెల్ప్ లైన్ సిసిఐ సిబ్బంది , జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలోమున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తాం



**-జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్...**

**గజ్వేల్ జనవరి 21 మన వార్త ప్రతినిధి** రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ చేస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది కొట్టాల యాదగిరి ముదిరాజ్ స్పష్టం చేశారు. బుధవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను వేధించిన ప్రతి ఒక్కరికీ తగిన బుద్ధి చెప్తామని, అలాగే ఇందుకు సహకరించిన నేతలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలను చైతన్యం చేస్తూ వారికి జరుగుతున్న అన్యాయాలను వివరిస్తామని తెలిపారు. చీకటి ఒప్పందాలతో ముందుకు వెళుతున్న కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ పార్టీలను కనుమరుగు చేయడమే తమ లక్ష్యం కాగా, త్వరలోనే పార్టీ స్థాపనతో సత్తా చాటుతామని చెప్పారు. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలకు దీటుగా జాగృతి ఎదుగుతున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం దర్యాప్తు జరపాలని, అవినీతి సొమ్మును కక్కించాలని డిమాండ్ చేశారు. ప్రతి శాఖలో అవినీతి చోటు చేసుకోగా, ఒక్కొక్కటిగా బయటపడుతున్నప్పటికీ చీకటి ఒప్పందంతో బిఆర్ఎస్ నేతలను సీఎం రేవంత్ రెడ్డి కాపాడుతున్నట్లు తెలిపారు. గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి లక్షల కోట్లను దారి మళ్లించగా, ఆ డబ్బుతోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. కామారెడ్డి డిక్లరేషన్ మేరకు రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ అమలయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వివరించారు.

## ముస్తాబాద్‌లో 'నో హెల్మెట్ - నో పెట్రోల్' నిబంధన అమలు: రోడ్డు భద్రతే లక్ష్యం




**మన వార్త ప్రతినిధి ముస్తాబాద్, జనవరి 21:** రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న 'అరైవ్ అలైవ్' (Arrive Alive) రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ముస్తాబాద్ పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి మరియు వాహనదారుల్లో అవగాహన కల్పించడానికి ముస్తాబాద్ సబ్ ఇన్‌స్పెక్టర్ (SI) ఆధ్వర్యంలో ఈరోజు మండలంలోని పెట్రోల్ బంకుల వద్ద ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.వార్త ముఖ్యాంశాలు:నిబంధన అమలు: ఇకపై ముస్తాబాద్ పరిధిలోని పెట్రోల్ బంకుల్లో హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్ పోయకూడదని ఎస్సై గారు యజమానులకు ఆదేశాలు జారీ చేశారు.అవగాహన కార్యక్రమం: 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వాహనదారులకు వివరించారు. శిరస్త్రాణం ప్రాణరక్ష కవచమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

## వెంకటాపూర్ పాఠశాలలో విద్యార్థులకు వాలీబాల్ కిట్లు అందజేసిన మామిడి చెట్టు కోటి



**వెంకటాపూర్ రామప్ప జనవరి21 మన వార్తా ప్రతినిధి** మంత్రివర్యులు ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలమేరకు, తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ధనసరి సూర్య అన్న సహకారంతో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల వెంకటాపురంలో NSUI జిల్లా అధ్యక్షులు మామిడిశెట్టి కోటి ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్ స్పోర్ట్స్ కిట్లు, షటిల్ బ్యాట్స్ మరియు కాక్స్ అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థులు క్రీడల్లో రాణించాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి, మానసిక స్థితిని మెరుగుపరచడానికి తోడ్పడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యంతో, యువజన నాయకులు మిల్కూరి యుగంధర్,మామిడిశెట్టి ధర్మతేజ,రెడ్డి శ్రీధర్,గుర్రపు ప్రవీణ్, జంగిలి రాజకుమార్, బానోత్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు స్తంభాలను తొలగించి ప్రమాదాలను అరికట్టాలి : బీజేపీ పార్టీ డిమాండ్



**కల్వకుర్తి జనవరి 21 మన వార్త ప్రతినిధి**తలకొండపల్లి మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ జరిగి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటికి కూడా రోడ్డు మధ్యలోఇబ్బందికరంగా ఉన్నస్తంభాలనుతొలగించలేదుఅదేవిధంగా గ్రామంలో 30 & 35 సంవత్సరాల క్రితం పైగా ఏర్పాటు చేసినటువంటిఇనుపస్తంభాలనుతొలగించాలనికోరుతూగతంలోవర్షాకాలంగాలివానలకుశిథిలావస్థకుగురైనటువంటి ఇనుప స్తంభాలు నేల కూలడం జరిగింది.మళ్ళీ ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా ఇనుప స్తంభాలను తొలగించి,వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటుచేయాలనికోరుతూమరి కొన్ని రోజులలోతలకొండపల్లి మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ చెన్నకేశవ స్వామి వారి (జాతర) బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాబోతున్నాయి,ఇదేదారిలోతేరుఉత్సవంఊరేగింపుజరుగుతుంది.కావునప్రమాదాలుజరిగేటటువంటిఅవకాశాలుఉన్నాయి కాబట్టి అధికారులు ప్రజాప్రతినిధులువెంటనేస్పందించిఇబ్బందికరంగా ఉన్నటువంటి స్తంభాలను మరియు గ్రామంలో ఇనుప స్తంబాలను తొలగించి ప్రమాదాలను అరికట్టాలనీ కోరుతూ బీజేపీ పార్టీ నాయకులు డిమాండ్ చేయడంజరిగింది.భారతీయ జనతా పార్టీ నాయకులు సమస్య ఉన్నటువంటి స్తంభాలను పరిశీలించి విద్యుత్ అధికారికి స్తంభాలను తొలగించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది.లేని యెడల బీజేపీ పార్టీ సమస్య పరిష్కారానికై ఉద్యమానికి సిద్ధంగా ఉంది.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షులు తిరుమని రవి గౌడ్ మరియు బీజేపీ జిల్లా కార్యదర్శిశానమోనిపాండు,బీజేవైఎం రాష్ట్ర నాయకులు నీలకంఠ పాండు, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్ ముదిరాజ్, హరికాంత్ , దుర్గపురం కుమార్, యాదయ్య,బోల్ల శీను, కుమార్ గౌడ్,చెన్నయ్య,చంద్రశేఖర్ గౌడ్,నూకంమహేష్,వెంకటేశ్ ,గ్రామ పెద్దలు రామచంద్రయ్య గారు, కుమార్ నరసింహ గార్లు కాలనీ వాసులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన నూతన సిఐ, ఎస్సై లు




**మందమర్రి, జనవరి 21 (మన వార్త ప్రతినిధి):**మందమర్రి పోలీస్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పర్స రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా మందమర్రి సిఐగా విధులు నిర్వహించిన కే శశిధర్ రెడ్డి బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో రమేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన సిఐ గా బాధ్యతలు చేపట్టిన రమేష్ కు మందమర్రి సర్కిల్ పరిధిలోని ఎస్ఐ లు మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలుపుతూ, స్వాగతం పలికారు. అదేవిధంగా బదిలీపై వెళ్లిన సిఐ కె శశిధర్ రెడ్డికి సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో క్రమశిక్షణ, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించిన సిఐ కే శశిధర్ రెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం నూతన సిఐ రమేష్ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణ తో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ, బాధ్యతలు నిర్వహిస్తానని తెలిపారు.ప్రత్యేకంగా నిషేధిత గుట్కా, గంజాయి విక్రయాలను పూర్తిగా అరికడతానని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై, ఈవ్ టీజింగ్ కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే డయల్ 100 కు ఫోన్ చేసి, పోలీసుల సహాయం పొందాలని, పోలీసులకు సమాచారం అందించి, సహకరించాలని కోరారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ నరేష్ కు పట్టణ పోలీస్ సిబ్బంది స్వాగతం పలుకుతూ, శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా ఇంటికి చేరాలి: డి.ఎస్.పి. వెంకట్ రెడ్డి



**కల్వకుర్తి.జనవరి 21 మన వార్తా ప్రతినిధి** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కల్వకుర్తి డి.ఎస్.పి. వెంకట్ రెడ్డి. సీఐ నాగార్జున జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా, మహబూబ్ నగర్ చౌరస్తా నుండి హైదరాబాద్ చౌరస్తా శివాజీ చౌక్ వరకు హెల్మెంట్ ధరించిప్రాణాలుకాపాడుకోవాలని ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కల్వకుర్తి డి.ఎన్.పి వెంకట్ [illegible] మత్తులో వాహనాలు నడవడం వల్ల మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేసినవారవుతారనిహెచ్చరించారు.గ్రామీణరోడ్లపైఅతివేగంతోవెళ్లడం,ఓవర్‌లోడింగ్‌తోప్రయాణించడంవల్లఅధికంగాప్రమాదాలుజరుగుతున్నాయని,వేగ నియంత్రణ పాటించాలని కోరారు.తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, ఒకవేళ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ అవగాహన సదస్సులోసి.ఐ.లు నాగార్జున.విష్ణువర్ధన్ రెడ్డి.ఎస్సైలు మాధవరెడ్డి. కురుమూర్తి. వీరబాబు.మహేష్.ఆర్టీవో అశోక్. ఎమ్మార్వో ఇబ్రహీం. కల్వకుర్తి పోలీస్ సిబ్బందివాహనదారులు.తదితరులు పాల్గొన్నారు.

## బీసీల ఐకత్యతోనే రిజర్వేషన్లు సాధ్యం ఆరె కటికలు రాజకీయంగా అభివృద్ధి చెందాలి



**శ్రీరంగాపురం జనవరి 21 : (మన వార్త ప్రతినిధి):** బీసీ కులాలు అన్ని ఏకమైతేనే 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోగలమని జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అభిప్రాయపడ్డారు.ఆరెకటికే అభివృద్ధి సంఘం అధ్యక్షులు భూపాల్ అశోక్ దాదా ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో అరెకటిక ఆత్మీయ సమ్మేళనం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ,జనసమితి పార్టీ అధ్యక్షులు,తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండ రామ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని నమ్మబలికి ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.నూతనంగా గెలుపొందిన ఖాజా లాంటి రాజకీయ నాయకులకు ప్రభుత్వం చేయుత ఇవ్వాలన్నారు.విద్యావేత్త, రాజకీయ నాయకుడు,తెలంగాణ జనసమితి పార్టీ వ్యవస్థాపకుడూ ప్రొపేసర్ కోదండా రామ్ మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా ఎదిగినప్పుడే సమానహక్కులు కలుగుతాయన్నారు.ఆరె కటిక కులం నుంచి వార్డు నెంబర్ గా గెలిచి ఉపసర్పంచ్ గా నియమితులైన కళ్యాణ్ కారి ఖాజాను ఈ సందర్భంగా అభినంధించారు.ఖాజా లాంటి వ్యక్తులు సమాజానికి ఎంతో అవసరమని,ప్రతీ ఒక్కరు రాజకీయంగా చైతన్యం కావాలని అన్నారు.ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య,కోదండ రామ్ ఖాజాను సాలువాతో సన్మానించి సత్కరించారు.

## అలంకారప్రాయంగా చేతి పంపు



**చందుర్తి, జనవరి 21,మన వార్త.**చందుర్తి మండలంలో కిష్టంపేట గ్రామంలో చేతి పంపు అలంకారప్రాయంగా మారింది.గ్రామ దేవత పోచమ్మ ఆలయ సమీపంలో ఉన్న చేతి పంపును గత కొన్ని సంవత్సరాల నుండి పట్టించుకునే వారు లేక నిరుపయోగంగా మారింది.పోచమ్మ ఆలయానికి వచ్చి పోయే భక్తులకు నీటి అవసరం ఉంటుండడంతో, వాడుకలో లేని చేతి పంపును రోజువారి వాడుక నీటి అవసరాల నిమిత్తం ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ విషయమై గ్రామ సర్పంచ్ మొకానపెల్లి దేవరాజు ను, గ్రామ పంచాయతీ కార్యదర్శి పర్శరాములు ను "మన వార్త విలేకరి" వివరణ అడగగా, త్వరలోనే గ్రామస్తుల అవసరల నిమిత్తం చేతి పంపు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు.

## వి బి జి, రామ్ జి పథకం పై అవగాహన సదస్సు హాజరైన ఎంపీ రఘునందన్ రావు...



**రామాయంపేట జనవరి 21( మన వార్త ప్రతినిధి )** రామయంపేట మండలం అక్కన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని చేశారు, సోలార్ సిస్టం డిజిటల్ తరగతులను ఆయన ప్రారంభించారు, విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని అడిగి పరిశీలించిన ఎంపీ రఘునందన్ రావు విద్యార్థులు సరియైన సమాధానం చెప్పకపోవడంతో అసహనం వ్యక్తం, చేశారు, రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో పంచాయతీ ఆవరణలో సర్పంచ్ యాదగిరి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విబి జి రామ్ జీ పథకం పైన ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు మెదక్ ఎంపీ రఘునందన్ రావు హాజరయ్యారు. ఆయన గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల బోధన తీరుపై అడిగి తెలుసుకున్నారు విద్యార్థులు సరియైన సమాధానం చెప్పకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలను పట్టణాలుగా తీర్చిదిద్దడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని వీబిజీ,రామ్ జి, పథకం ద్వారా ఉపాధి హామీలో మార్పులు చేయడం జరిగిందని, ఉపాధి హామీ పథకం ద్వారా పంచాయతి భవనాలు, మహిళా సంఘాల భవనాలు, రైతులకు గిడ్డంగులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు, కూలీలకు 125 పని దినాలను పెంచుతూ పనులు చేసిన 15 రోజులలోపే నేరుగా కూలీల ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని అన్నారు,ఉపాధి హామీ పథకంపై సలహాలు ఇవ్వాల్సిన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నాలు చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కొంటుపడిందని ఆయన తెలిపారు, గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాల కొరకు కేంద్ర ప్రభుత్వం సుమారు 1200 కోట్ల నిధులు మంజూరు చేసిందని అన్నారు, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సర్పంచ్లకు సూచించారు, మార్చి 31 లోపు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన తెలిపారు,ఈ కార్యక్రమంలో అక్కన్నపేట సర్పంచ్ యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, రామాయంపేట పట్టణ అధ్యక్షుడు అవినాష్ రెడ్డి, చింతల శేఖర్, వెలుముల సిద్ధిరాములు, దంతేపల్లి సర్పంచ్ బాలరాజు, భానుచందర్, శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కే 1ఏ సమ్మక్క సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు

**మందమర్రి, జనవరి 21 (మన వార్త ప్రతినిధి):** ఏరియాలోని ఆర్కే 1ఏ గని వద్ద సమ్మక్క సారలమ్మ జాతరకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించడం జరిగిందని, తాగునీరు, విద్యుత్ దీపాలు, రాత్రి ఉండాలనుకున్న



వారికోసం పోలీస్ బందోబస్తు, సాంస్కృతిక కార్యక్రమాలు, అనుక్షణం సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని, ఏరియా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, ఉద్యోగులు ఆర్కే 1ఏ జాతరకు విచ్చేసి, అమ్మవార్ల కరుణ కటాక్షాలు పొందాలని సింగరేణి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ కోరారు. ఏరియాలోని ఆర్కే 1ఏ సమీపంలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జాతర ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై, సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, బోనాలు సమర్పించారు. అనంతరం జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ, తెలంగాణలో జరిగే అతిపెద్ద జాతర సమ్మక్క సారలమ్మ జాతర అని, అటువంటి ఈ జాతరను ఏరియాలోని ఆర్కే 1ఏ వద్ద అత్యంత ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ యేడు జనవరి 28 నుండి జనవరి 31 వరకు జరిగే ఈ జాతరకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో ఈ జాతర జరపడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. 1985లో సింగరేణి ఉద్యోగులు మేడారం నకు వెళ్లి, అమ్మ వార్లకు మొక్కలు చెల్లించేవారని, తద్వారా సింగరేణిలో గైరు హాజరు శాతం పెరిగేదని, గైర్హాజరు తగ్గించేందుకు సింగరేణి యజమాన్యం మేడారంలో జరిగే విధంగా జాతర ఏర్పాట్లు అన్ని ఏరియాలలో నిర్వహించాలని నిర్ణయించి, 1986 నుండి సుమారు 40 సంవత్సరాలుగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ పండుగను చాలా వైభవంగా జరుపుకోవడం జరుగుతుందని వివరించారు. రామకృష్ణాపూర్, మందమర్రి, చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు, ఉద్యోగులు వేలాదిగా వచ్చి, జాతర సమయంలో అమ్మవార్లను దర్శించుకొని, వారి కృపా, కరుణ కటాక్షాలు పొందడం జరుగుతుందని తెలిపారు. సింగరేణి యాజమాన్యం, అన్ని కార్మిక సంఘాలు, పుర ప్రముఖులు సహాయ సహకారాలతోనే ఇంత గొప్పగా జాతరను జరుపుకోవడం సాధ్యమవుతుందని, అందరిపై అమ్మవార్ల కరుణ కటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. జాతర ఏర్పాట్లకు సహకరించిన ప్రతి ఒక్క విభాగం వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం జివిల్ ప్రసాద్, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, రామకృష్ణాపూర్ బ్రాంచ్ కార్యదర్శి అక్బర్ ఆలీ, కేకే ఓసిపి ప్రాజెక్ట్ అధికారి మల్లయ్య, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, శాంతిఖని గ్రూప్ ఏజెంట్ ఖాదీర్, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి జా, డిజిఎం పర్సనల్ అశోక్, డిజిఎం ఐఈడి కిరణ్ కుమార్, డిజిఎం ఎఫ్అండ్ఏ ఆర్విఎస్ఆర్కే ప్రసాద్, సివిల్ ఎస్ఈ శ్రీధర్, ఎన్విరాన్మెంటల్ అధికారి వెంకట్ రెడ్డి, పర్చేస్ అధికారి బాబు, సీనియర్ పర్సనల్ అధికారి సత్యనారాయణ, ఐటి డివై మేనేజర్ రవి, ఏఐటీయూసీ యూనియన్ నాయకులు, ఏరియా అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ విధానాలతో సింగరేణి మనుగడకే ముప్పు



**మందమర్రి, జనవరి 21 (మన వార్త ప్రతినిధి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వలన సింగరేణి బొగ్గు పరిశ్రమ మనుగడకే ముప్పు వస్తుందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకులు తెలిపారు. యూనియన్ అధినాయకత్వం పిలుపుమేరకు బుధవారం ఏరియాలోని అన్ని గనులు, విభాగాలపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సింగరేణి అధికారులకు అందజేశారు. ఏరియాలోని కేకే 5 గని పై నిర్వహించిన కార్యక్రమానికి యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ ముఖ్యఅతిథిగా హాజరై, ఆందోళనల కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా ఏరియాలోని కాసీపేట 2 గని పై యూనియన్ నాయకులు ప్రతాప్ సారంగపాణి, కారుకూరి తిరుపతి ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం గని ఇంచార్జ్ మేనేజర్ రవిశంకర్ కు వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో జరుగుతున్న దోపిడీపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో సింగరేణి సంరక్షించబడిందని పునరుద్ఘటించారు. కాంగ్రెస్ వచ్చిన రెండేళ్లలో సింగరేణి మొత్తంగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో జరిగిన దోపిడీపై వెంటనే సిబిఐ దర్యాప్తు నిర్వహించాలని, దోపిడికి సంబంధం ఉన్న ప్రతి అధికారిని, కాంగ్రెస్ పెద్దలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కబంధ హస్తాల నుండి సింగరేణి కాపాడాలని, సింగరేణిలో మెడికల్ బోర్డు యథావిధిగా కొనసాగించి, కారుణ్య నియామకాలు అమలుపరచాలన్నారు. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు లాభాల వాటా, దీపావళి బోనస్ లను ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే చెల్లించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం నుండి సింగరేణికి రావాల్సిన 50 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను సమర్థవంతంగా సిద్ధం చేయాలి.....



**–మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్....**

**రామాయంపేట జనవరి 21 ( మన వార్త ప్రతినిధి)** రామాయంపేట పట్టణంలోనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలుర లో పదవ తరగతి ప్రత్యేక తరగతులను కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచే లక్ష్యంతో, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి అదనపు తరగతులు నిర్వహించలని తెలిపారు.ప్రత్యేక తరగతుల నిర్వహణ వల్ల నాణ్యమైన విద్యను అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. అనంతరం కలెక్టర్ ఉపాధ్యాయుల బోధన శైలిని పరిశీలిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. గణితం, సైన్స్, ఇంగ్లీష్ వంటి ముఖ్యమైన సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు పెట్టాలని ఆదేశించడం జరిగిందని అన్నారు.ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నార్లాపూర్ అభివృద్ధికి తోడ్పాటు



**–రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి...**

**మందమర్రి, జనవరి 21 (మన వార్త ప్రతినిధి):** మున్సిపాలిటీలోని 6వ వార్డు నార్లాపూర్ అభివృద్ధికి తోడ్పడుతానని వివేక్ వెంకటస్వామి తెలిపారు. మున్సిపాలిటీలోని 6వ వార్డు నార్లాపూర్ గ్రామం స్టేజి నుండి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల వరకు కోటి రూపాయలతో సీసీ రోడ్డు పనులకు మంత్రి వివేక్ వెంకటస్వామి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 6వ వార్డు నార్లపూర్ గ్రామ అభివృద్ధి లో భాగంగా వార్డుకు నాలుగు కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగినదని, సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. పనులన్నీటిని ఒకటి తర్వాత ఒకటి పనులు చేస్తూ, నార్లాపూర్ అభివృద్ధికి తోడ్పడుతానని తెలిపారు. అనంతరం రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామిని తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చెగొండ రాజన్న యాదవ్ ఘనంగా శాలువతో సన్మానించి గొర్ల మేకల కాపరి దారుల సమస్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, కార్యకర్తలు, గొర్ల మేకల కాపరిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్



**మందమర్రి, జనవరి 21 (మన వార్త ప్రతినిధి):** ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం అండగా నిలుస్తూ, వైద్య సహాయం అందిస్తుందని మండలంలోని చిర్రకుంట గ్రామ సర్పంచ్ రాంటెంకి శ్రీలత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్, మాజీ సర్పంచ్ ఓడ్నాల కొమురయ్య లు తెలిపారు. శనివారం చిర్రకుంట గ్రామానికి చెందిన నిమ్మతి మల్లయ్య కు మంజూరైన 25 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో కొలువైన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పేద ప్రజలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని 10 లక్షల కు పెంచడంతోపాటు సీఎం సహాయనిధి కింద పేదలకు మెరుగైన వైద్యం కల్పిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జనార్ధన్, తిరుపతి, సుధాకర్, పోచయ్య లు పాల్గొన్నారు.

## ఘనంగా మార్కండేయ జయంతి ఉత్సవాలు




**మంచిర్యాల, జనవరి 21 (మన వార్త ప్రతినిధి):** జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని లక్ష్మీ నగర్ కాలనీలో బుధవారం శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో పద్మశాలియుల ఋషి, సంస్కృతి, కులదైవమైన శ్రీ భక్త మార్కండేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మార్కండేయ చిత్రపటానికి పూలమాలు వేసి, ఘనంగా నివాళులు అర్పించి, అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాలలో ముందుండాలని, అలా జరగాలంటే రాజకీయంగా పద్మశాలీలు రాణించాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో అవకాశం ఉన్న వార్డులో పద్మశాలీలు పోటీ చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ మిత్రులను కలుపుకొని, వారి సహకారంతో గెలుపుకు బాటలు వేసుకొని, గెలుపొంది తమ సత్తా చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు బుర్ర జ్ఞాని, కార్యదర్శి అడిచర్ల రాజేశం, నాయకులు చిప్ప రామస్వామి, ఎం సత్యనారాయణ, కొండ శంకరయ్య, వెంకటేశ్వర్, దేవులపల్లి రామస్వామి, కే ముని లు పాల్గొన్నారు.

## నోటీసులు సరే మరి చర్యలు ఎప్పుడు...



**నార్సింగి జనవరి 21 ( మన వార్త ప్రతినిధి)** నార్సింగి మండలం శంఖాపూర్ లోని సర్వే నం 278 పీ, 279 పీ లో శ్రీకర హౌసింగ్ ప్రాజెక్ట్ లిమిటెడ్ వారి వెంచర్ లో అనుమతులకు విరుద్ధంగా గోడలు, గేటు ఏర్పాటు చేసి స్థానిక రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, సమస్య పరిష్కరించాలని రైతులు ప్రజా వాణి లో కలెక్టర్ కు, డీపీఓ కు వినతి పత్రాలు సమర్పించారు. సమస్య పరిష్కారం కోసం డీపీఓ యాదయ్య ఆదేశాల మేరకు ఈ నెల 7 న గ్రామ పంచాయతీ కార్యదర్శి మౌనిక వెంచర్ గేటు పై నోటీసులు అంటించారు. ఆ నోటీసులో వెంచర్ కు ఎల్.ఆర్.ఆర్.ఓ.సీ. నం 14/2014 /ఈ పీ/డీ టీ సీ పీ ఓ /మెదక్ డేట్ 13/02/2024 ప్రకారం అనేక్జర్ లోని క్రమ సంఖ్య 8 లో ఓపెన్ వెంచర్ గా అనుమతులు ఉన్నాయని, అనుమతులకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన గేటు, గోడలు రెండు రోజులలో తొలగించించాలని లేకపోతే పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టంగా పేర్కొన్నారు. అధికారులు రెండు రోజుల గడువును పేర్కొంటూ నోటీసులు పంపి 13 రోజులు గడిచినా, నోటీసుకు సంబంధం లేకుండా వెంచర్ నిర్వాహకులు పంపిన జవాబు అంది 11 రోజులు దాటినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పై డీ.ఎల్.పీ.ఓ యాదయ్య ను వివరణ కోరారు. ఈ వారంలో తానే స్వయంగా వెంచర్ ను సందర్శించి తగిన చర్యలు తీసుకుంటానని అన్నారు. రైతులకు దారి సమస్య ఏర్పడి (వెంచర్ గేటు, గోడలు) దాదాపు మూడు నెలలు గడిచిన పరిష్కారం కానీ సమస్య డీ.ఎల్.పీ.ఓ యాదయ్య ఎప్పుడు పరిష్కరిస్తారో వేచి చూడాల్సిందే.

## ప్రమాదాల నివారణకు అందరం కలిసి పనిచేద్దాం




**మంచిర్యాల, జనవరి 21 (మన వార్త ప్రతినిధి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ తోపాటు సురక్షితమైన ప్రయాణ వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి ప్రజలందరూ కలిసి పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్–అలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అధ్యక్షతన మీడియా అవుట్‌రీచ్ డే కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాల రహిత కమిషనరేట్‌గా తీర్చిదిద్దేందుకు ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ (అవగాహన), ఎన్ఫోర్స్‌మెంట్ (కఠిన అమలు) తదితర మూడు విధానాలను అమలు చేస్తున్నామని వివరించారు. సమాజంలోని మారుమూల ప్రాంతాల వరకు సమాచారాన్ని చేరవేసే శక్తి మీడియాకు ఉన్నందున, పోలీస్ శాఖతో సమన్వయంతో మీడియా రోడ్డు భద్రత సందేశాలను ప్రతి ఇంటికి చేరవేయడంలో కీలక పాత్ర పోషించాలని సీపీ కోరారు. అందరం కలిసి అరైవ్–అలైవ్ లక్ష్యంగా ప్రమాదాల నివారణ, సురక్షిత ప్రయాణం, క్షేమంగా గమ్యం చేరే వాతావరణాన్ని ఏర్పాటు చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులతో కలిసి అరైవ్–అలైవ్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, సీఐ లు ప్రమోద్ రావు, అశోక్, శ్రీలత, నరేష్ కుమార్, ఎస్ఐ లు పాల్గొన్నారు.

## 'బలగం' తర్వాత వేణు సంచలనం..!




**హైదరాబాద్** తెలుగు సినీ రంగంలో 'బలగం' చిత్రంతో ఒక్కసారిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించిన దర్శకుడు వేణు దాదాపు మూడు సంవత్సరాల విరామం తర్వాత తన రెండో చిత్రంగా 'ఎల్లమ్మ'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార దృశ్యాలు విడుదల కావడంతో కథాంశంపై ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణలో భక్తిశ్రద్ధలతో పూజించే ఎల్లమ్మ దేవత చుట్టూ కథ సాగనున్నట్లు స్పష్టమవుతోంది.ఈ చిత్రంలో ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ తొలిసారిగా ప్రధాన పాత్రలో కనిపించనుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచింది. దర్శకుడు వేణు సుమారు 8 గంటల పాటు కథను వివరించగా, అందులోని భావోద్వేగం, తెలంగాణ సెంటిమెంట్ దేవిశ్రీప్రసాద్‌ను బాగా ఆకట్టుకున్నట్లు సమాచారం. చిత్రంలో ఆయన 'పర్శి' అనే మాస్ పాత్రలో కనిపించనుండగా, లుక్ మరియు సంభాషణలు ప్రేక్షకులను ఆకర్షించేలా రూపొందినట్లు తెలుస్తోంది.ఇంకో ఆసక్తికర అంశం ఏమిటంటే ఈ చిత్రంలో సాధారణ కథానాయిక పాత్ర ఉండదట. మొత్తం కథ ఎల్లమ్మ దేవత చుట్టూనే తిరిగేలా రూపొందించారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవత పాత్ర కోసం ప్రముఖ నటి కీర్తి సురేష్‌ను సంప్రదించినట్లు చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఆమె అంగీకారం లభిస్తే దేవత పాత్రలో ఆమె, భక్తుడి పాత్రలో దేవిశ్రీప్రసాద్ కనిపించే అవకాశం ఉందని సమాచారం.'బలగం'లో గ్రామీణ వాతావరణం, తెలంగాణ సంస్కృతి, భావోద్వేగాలను అద్భుతంగా ఆవిష్కరించిన వేణు, ఈసారి భక్తి, మాస్ భావోద్వేగాలు, సామాజిక అంశాలను మేళవించి 'ఎల్లమ్మ'ను రూపొందిస్తున్నారని తెలుస్తోంది. ఈ చిత్రం ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని అందిస్తుందని సినీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## బీసీసీఐతో గూగుల్ కృత్రిమ మేధ ఒప్పందం..




**ముంబై** మార్చి నెలలో ప్రారంభం కానున్న ఐపీఎల్ 19వ సీజన్ కోసం బీసీసీఐ గూగుల్‌తో భారీ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం రాబోయే 3 ఐపీఎల్ సీజన్లకు గూగుల్ జెమిని కృత్రిమ మేధ స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. ఈ డీల్ మొత్తం విలువ రూ.270 కోట్లు కాగా, ఏడాదికి సుమారు రూ.90 కోట్లు చొప్పున చెల్లించనున్నారు. టీ20 ప్రపంచకప్ మార్చి 8న ముగిసిన వెంటనే ఐపీఎల్ సందడి మొదలవుతుందని అధికారులు తెలిపారు.ఈ ఒప్పందంతో ఐపీఎల్ బ్రాండ్ విలువ మరింత పెరుగుతుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. క్రికెట్ విశ్లేషణలు, డేటా నిర్వహణ, అభిమానులకు మెరుగైన అనుభూతి అందించడంలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషించనుంది. కేవలం ఐపీఎల్‌కే కాకుండా మహిళల ప్రీమియర్ లీగ్‌లో కూడా కృత్రిమ మేధ ప్రభావం పెరుగుతోంది.ఇప్పటికే మహిళల లీగ్‌కు మరో ప్రముఖ టెక్నాలజీ సంస్థ స్పాన్సర్‌గా ఉండగా, ఇప్పుడు గూగుల్ కూడా ఐపీఎల్‌లోకి అడుగుపెట్టడంతో టెక్ దిగ్గజాల మధ్య పోటీ మొదలైంది. క్రికెట్ అభిమానులకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ఈ సంస్థలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. దీంతో భవిష్యత్తులో క్రికెట్‌లో టెక్నాలజీ వినియోగం మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## సూపర్‌స్టార్స్‌తో ఛాన్సులు..



**హైదరాబాద్** తన కెరీర్‌లో వరుసగా ఇద్దరు అగ్ర నటులతో కలిసి నటించే అవకాశాలు రావడంతో హీరోయిన్ నిధి అగర్వాల్ మంచి ఉత్సాహంలో ఉంది. గత ఏడాది పవన్ కళ్యాణ్ సరసన హరిహర వీరమల్లు చిత్రంలో నటించిన నిధి, ఈ సంక్రాంతికి ప్రభాస్‌తో కలిసి రాజా సాబ్ సినిమాలో కనిపించింది. ఈ రెండు సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా తన కెరీర్‌పై మాత్రం ఎలాంటి ప్రభావం లేదని నిధి స్పష్టంగా చెప్పింది. పవన్ కళ్యాణ్ చిత్రంలో అవకాశం రావడం తన జీవితంలో కీలక మలుపుగా మారిందని పేర్కొంది.రాజకీయ బిజీ షెడ్యూల్ కారణంగా హరిహర వీరమల్లు షూటింగ్ ఆలస్యం అయినప్పటికీ పవన్ కళ్యాణ్ ఎంతో కష్టపడి సినిమా పూర్తి చేశారని నిధి వెల్లడించింది. ప్రచార కార్యక్రమాల బాధ్యతను తానే ఎక్కువగా నిర్వహించానని తెలిపింది. ఆ క్రమంలో పవన్ కళ్యాణ్ నుంచి ప్రశంసలు కూడా అందాయని చెప్పింది. అనంతరం ప్రభాస్‌తో చేసిన సినిమా పెద్ద విజయం సాధించకపోయినా తన నటనకు మంచి గుర్తింపు వచ్చిందని వివరించింది.ప్రచార కార్యక్రమాల సమయంలో ఒక మాల్‌లో జరిగిన ఘటన తనను కలచివేసిందని నిధి తెలిపింది. అభిమానులు చుట్టుముట్టి అసభ్యంగా ప్రవర్తించడంతో భద్రతా సిబ్బంది సహాయంతో బయటకు వచ్చినట్లు చెప్పింది. ఈ ఘటన తీవ్ర వివాదంగా మారిందని గుర్తు చేసింది.ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నిధి సినీ పరిశ్రమలో జరుగుతున్న నెగటివ్ ప్రచారాలపై స్పందించింది. కొందరు కావాలని పెద్ద మొత్తంలో ఖర్చు చేసి ఇతరులపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించింది. నటీనటులు చాలా భావోద్వేగంగా ఉంటారని, ఇలాంటి ప్రచారాలు వారి కుటుంబాలను కూడా బాధపెడతాయని చెప్పింది. తాము సమాధానం చెప్పాల్సింది తల్లిదండ్రులకు మాత్రమేనని స్పష్టం చేసింది. తనపై కూడా ఒకటి రెండు సార్లు ఇలాంటి ప్రచారాలు జరిగాయని, కానీ ధైర్యంగా ఎదుర్కొన్నానని తెలిపింది. కాశీకి వెళ్లి వచ్చిన తర్వాత ఆధ్యాత్మికంగా బలంగా మారానని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనే శక్తి వచ్చిందని నిధి వెల్లడించింది.

## టీ20 ప్రపంచకప్‌పై సందేహాలు

### బంగ్లా కెప్టెన్ లిటన్ దాస్ సంచలన వ్యాఖ్యలు..!



**ఢాకా** టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ జట్టు పాల్గొనడంపై అనిశ్చితి కొనసాగుతోంది. భద్రతా కారణాలను చూపుతూ తమ మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కోరగా, అంతర్జాతీయ క్రికెట్ మండలి అందుకు సానుకూలంగా స్పందించకపోవడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. ప్రపంచకప్‌కు ఇంకా కేవలం 2 వారాల సమయం మాత్రమే ఉండటంతో అభిమానుల్లో ఆందోళన పెరుగుతోంది.ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడిన జట్టు కెప్టెన్ లిటన్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచకప్‌లో జట్టు పాల్గొంటుందా లేదా అన్న ప్రశ్నకు ఆయన స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. ఈ అంశంపై తాను మాట్లాడేందుకు ఏమీ లేదని, ప్రపంచకప్ ఇంకా దూరంలో ఉందని వ్యాఖ్యానించారు. జట్టు భారత్‌కు వెళ్లే విషయంలో బోర్డు తమతో ఎలాంటి చర్చ జరపలేదని, అందువల్ల తుది నిర్ణయం ఏమిటో తానూ చెప్పలేనని లిటన్ దాస్ తెలిపారు.కెప్టెన్ చేసిన ఈ వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఒకవైపు భద్రతా ఆందోళనలు, మరోవైపు అంతర్జాతీయ క్రికెట్ మండలి వైఖరి కారణంగా బంగ్లాదేశ్ పాల్గొనడంపై సందిగ్ధత కొనసాగుతోంది. త్వరలోనే ఈ అంశంపై స్పష్టత రావాలని అభిమానులు ఆశిస్తున్నారు.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com

# మినరల్ వాటర్ కోసం తప్పని తిప్పలు



**చందుర్తి, జనవరి 21, మన వార్త.** చందుర్తి మండలం కిష్టంపేట గ్రామం లో దాదాపు 800 మంది ప్రజల దాహార్తిని తీర్చే శుద్ధ జల కేంద్రం(వాటర్ ప్లాంట్) గ్రామస్తులకు ఇబ్బందిగా మారింది. కిష్టంపేట గ్రామ మసీద్ ముందర ఉన్న శుద్ధ జల కేంద్రం మరమ్మత్తులు చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు ఆరోపిస్తున్నారు. వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయకపోవడం వల్ల గ్రామస్తులు, అనేక ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ మొకానపెల్లి దేవరాజు ప్రత్యేక చొరవ తీసుకోని నూతన శుద్ధ జలకేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మొకానపెల్లి దేవరాజు ను వివరణ కోరగా వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ త్వరలోనే నూతన వాటర్ ప్లాంట్ మంజూరు చేస్తానని చెప్పడం జరిగిందన్నారు. వీలైనంత తొందరగా వాటర్ ప్లాంట్ మిషన్ తీసుకు వచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయాన్నారు.

## 108 బంగారు పుష్పాలతో శ్రీవారికి అష్టదళ పాదపద్మార్చన సేవ...



**–ఘనంగా శ్రీనివాసుడి నిత్య కళ్యాణం మహోత్సవం...**
**–శోభాయమానంగా స్వర్ణగిరీశునికి తీరు వీది ఉత్సవ సేవ...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి జనవరి 21** తెలంగాణలోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన యాదాద్రి తిరుమల స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో బుధవారం రోజు ఉదయం 108 బంగారు పుష్పాలతో అష్టాదశ పద్మార్చన సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవాన్ని ఆలయ ప్రదాన ఆర్చకులు దిట్టకవి శ్రవణాచార్యులు దివ్య కరములచే అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు , ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఉదయం 5:45 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థంను బంగారు బావి నుండి శ్రద్ధాభక్తులతో తీసుకువచ్చారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మణిమయ శోభిత స్వర్ణాభరణాలతో, పరిమళభరిత పుష్పమాలల తో శోభాయమానంగా అలంకరించి , వేయి నామాలతో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. లోక కళ్యాణం కోసం అర్చకులు శ్రీ సుదర్శన నారసింహ హవనాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం సందర్భంగా స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య పాదార విందములకు ఒక వంద ఎనిమిది బంగారు అష్టదళ పద్మ పుష్పాలతో , శ్రీ స్వామివారికి అష్టోత్తర శతనామాలతో అష్టదళ పాదపద్మార్చన సేవను నిర్వహించారు. భక్తులు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ఆనంద పరవశులయ్యారు. స్వామి వారి నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా నేడు సుమారు 3,000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30 గంటలకు ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ తిరువీధి ఉత్సవ సేవను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. ఈరోజు శ్రీ స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు ఆలయ చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు తెలిపారు.

# కేంద్రీయ విద్యాలయం ద్వారా గుణాత్మక విద్య



**–జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్...**

**మంచిర్యాల, జనవరి 21 (మన వార్త ప్రతినిధి):**కేంద్రీయ విద్యాలయం ద్వారా విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన గుణాత్మక విద్య అందించబడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల ప్రధానమంత్రి కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన వార్షిక క్రీడా దినోత్సవం వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్రీయ విద్యాలయాల ద్వారా కుణాత్మక విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల నిర్వహణ కమిటీ ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు జరుగుతూ ఉంటాయని, ఈ నేపథ్యంలో వారి పిల్లలకు విద్యా సంవత్సరంలో ఆటంకం కలగకుండా ఈ విద్యాలయాల ద్వారా విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. కేంద్రీయ విద్యాలయం విద్యార్థికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, అన్ని రంగాలలో క్రీడా స్ఫూర్తితో ఉండాలని, గెలుపు మాత్రమే కాకుండా అందరితో స్నేహభావంతో కలిసి ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం నస్పూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న బాలసదనము భవన నిర్మాణ పనులను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. బాలల సంరక్షణ కొరకు 1 కోటి 34 లక్షల రూపాయల మిషన్ వాత్సల్య నిధులతో భవన నిర్మాణం చేపట్టడం జరిగిందని, పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో కొనసాగుతున్న ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురుబాధితకుటుంబాలకు కొండంత అండగా ఆర్థిక సాయం చేసిన ఉప్పల వెంకటేష్



**కల్వకుర్తి. జనవరి 21 మన వార్త ప్రతినిధి** కల్వకుర్తి మండలం జిలేళ్ళ గ్రామానికి చెందిన రేవెల్లి కృష్ణవేణి, తోటపల్లి బాలమణి,గుమ్మకొండజంగయ్య,అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఈ విషయం స్థానిక బిఆర్ఎస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్నఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ బాధితకుటుంబాలకుభరోసానిస్తూ ఒక్కొక్కరికి 3000 మూడు వేల రూపాయలచొప్పునముగ్గురుకుటుంబాలకు 9000 రూపాయలు స్థానిక బిఆర్ఎస్ నాయకులు ద్వారా బాధితకుటుంబాలకుఅందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య, మాజీ ఎంపీటీసీ శోభ శేఖర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పాండు గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మూడవ వార్డు సభ్యులు ముత్యాల నరేష్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యాల రమేష్, జిలేళ్ళ గౌడ సంఘం అధ్యక్షులు జంగయ్య, బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు గుమ్మకొండ రమేష్,యాదయ్య, ఈదమయ్యా, గుమ్మ కొండ వినయ్,మరియు కర్నాటి వెంకటేష్, పట్టపర్ల రామకృష్ణ, గుమ్మకొండ క్రాంతి ,ఆటో పాండు గౌడ్, కర్నాటి కృష్ణయ్య, గుమ్మకొండ లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్కసారమ్మలకు మొక్కులు చెల్లించిన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు



**మందమర్రి జనవరి 21 (మన వార్త ప్రతినిధి):**కోరిన కోరికలు తీర్చే వనదేవతలుగా ప్రఖ్యాతి చెందిన సమ్మక్క సారలమ్మకు తమ కోరికలు నెరవేరితే భక్తులు తమ నిలువెత్తు బంగారం (బెల్లం), మేకతో అమ్మవారిని కొలుచుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో బుధవారం పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో అమ్మవార్లకు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, ఆయన సతీమణి మాజీ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు నల్లాల ఓదెలు నిలువెత్తు బంగారాన్ని తులాభారం వేసి, అనంతరం పట్టణంలోని ఆయన నివాసంలో అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా నల్లాల ఓదెలు మాట్లాడుతూ, కోరిన కోరికలు తీర్చే వన దేవతలు సమ్మక్క సారలమ్మ తల్లుల కృప కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆయన అమ్మవార్లను వేడుకున్నారు. ప్రజల ఆశీస్సులు, అమ్మవార్ల కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ తమపై, తమ కుటుంబం పై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓదెలు కుటుంబ సభ్యులు, మిత్రులు, అనుచరులు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



**గజ్వేల్, జనవరి 21 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో తెలంగాణ మెడికల్ మరియు హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అన్నపూర్ణ హాజరయ్యారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దుర్గం శ్రీనివాస్ ఆధ్వర్యంలో డాక్టర్ అన్నపూర్ణ చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, స్వామి, నవీన్, భాను, కమలాకర్, మధు,శ్రీనివాస్, హుస్సేన్, దేవేందర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కోతుల బెడదపై చర్యలు తీసుకోవాలని అటవీ శాఖకు వినతి అందచేసిన పాలకవర్గం...



**చేగుంట జనవరి 21 ( మన వార్త ప్రతినిధి )** చేగుంట గ్రామంలో కోతుల బెడద విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, మహిళలు, వృద్ధులు కోతుల దాడుల వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటి బయటకు రావడమే కష్టంగా మారిందని వారు తెలిపారు. సమస్యపై వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ చేగుంట గ్రామపంచాయతీ సర్పంచ్ సంద్రగు ప్రవంతి సతీష్, ఆధ్వర్యంలో ఉప్ప సర్పంచ్ మహ్మద్ రఫీ, పాలకవర్గ సభ్యులు వంశీ, మహ్మద్ ఆరిఫ్, ఆకుల సుఖేందర్, కోయల్ కార్ రవి, తలారి లింగం, శ్రీనివాస్, కట్ట శ్రీనివాస్ లు కలిసి మెదక్ జిల్లా అటవీ శాఖ అధికారి జోజీ కి వినతి పత్రం అందచేశారు, గ్రామస్థులు కోతుల బెడదను తగ్గించేందుకు అటవీ శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుందని వారు అన్నారు.

## విజయవంతంగా ముగిసిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్



**–టోర్నమెంట్ విజేత సింగరేణి పాఠశాల...**

**మందమర్రి, జనవరి 21 (మన వార్త ప్రతినిధి):**పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో నజీర్ సౌండ్ సిస్టం, అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు విజయవంతంగా ముగిసాయి. హోరాహోరి గా సాగిన ఈ పోటీల్లో 9 జట్లు తలపడగా, సింగరేణి పాఠశాల జట్టు, హైదరాబాద్ కృష్ణవేణి టాలెంట్ పాఠశాల జట్టు ఫైనల్ కు చేరాయి. బుధవారం ఆధ్యాంతం ఉత్కంఠ భరత సగిన ఫైనల్ మ్యాచ్లో సింగరేణి పాఠశాల జట్టు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, టోర్నమెంట్ విజేతగా నిలిచి, మొదటి బహుమతి సాధించారు. అనంతరం నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమానికి మండల తహశీల్దార్ పీ సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుండే క్రీడలు పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం కలుగుతుందని తెలిపారు. పరీక్షల సమయంలో ఇలాంటి పోటీలు విద్యార్థుల మానసిక ఒత్తిడి నుండి దూరం చేసి పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచేలా చేస్తాయన్నారు. విద్యార్థులు క్రీడలతోపాటు చదువులో సైతం రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె పురుషోత్తం మాట్లాడుతూ, పోటీల్లో విజయం, ఈ క్రీడోత్సవం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, క్రీడాధ్యయన పట్టుదలను పెంచిందని తెలిపారు. సింగరేణి పాఠశాల జట్టు అద్భుతమైన ప్రదర్శన చేసి, అందర్నీ ఆకట్టుకుందన్నారు. ఈ విజయం పాఠశాలకు గర్వకారణంగా నిలిచిందని తెలిపారు. ఈ విజయం సాధించిన విద్యార్థులను, సహకరించిన పిఆర్ఓ దయాకర్, పిఈటి శ్రీనివాస్, జూనియర్ పిటి శ్రీనివాస్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల అభ్యుదయానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు.

## శాంతియుతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు



**–జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్...**

**మంచిర్యాల, జనవరి 21 (మన వార్త ప్రతినిధి):**రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు – 2026 శాంతియుతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా 163 బిఎన్ఎస్ఎస్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన తర్వాత ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్, పోలింగ్, లెక్కింపు వంటి కీలక కార్యక్రమాల సమయంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చట్ట ప్రకారం పోలింగ్ ముగిసే సమయానికి నిర్ణయించిన 48 గంటల వ్యవధిలో నిబంధనలను ఉల్లంఘించే కార్యక్రమాలు, బహిరంగ సమావేశాలు నిషేధించడం జరిగిందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి బహిరంగ సభ, ఊరేగింపు, ప్రసంగాలు, ప్రసార, ప్రచార సాధనాల ద్వారా ప్రచారం, ఓటర్లను ప్రభావితం చేసే కార్యక్రమాలను నిర్వహించడం నిషిద్ధమని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఆయుధాలు కలిగి ఉండడం, ప్రచార వాహనాలు, ప్రచారం చేయడం, 5 కంటే ఎక్కువ మంది కలిసి ఉండడం, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయడం నిషేధించడం జరిగిందని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై భారత్ నాగరిక్ సురక్ష సంహిత చట్టంతో పాటు ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు....



**చిన్న శంకరం పేట జనవరి 21 ( మన వార్త ప్రతినిధి )** చిన్న శంకరంపేట మండల కేంద్రంలో శ్రీ భక్త మార్కండేయ జయంతి వేడుకలను పట్టణ అధ్యక్షుడు ఉ దుత శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి జెండా ఎగరవేశారు, ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాస్ పట్టణ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ ఉపాధ్యక్షులు సిరిగడ్డ పవన్ ప్రధాన కార్యదర్శి సిరిగదే ప్రవీణ్ కుమార్ కోశాధికారి వనం శ్రీనివాస్ జాయింట్ సెక్రెటరీ సిరిగది రాము గౌరవాధ్యక్షులు తుమ్మ సత్యనారాయణ వనం నర్సింలు ఎరగంటి కిష్టయ్య, చిప్ప కృష్ణ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# సోషల్ టాలెంట్ టెస్ట్ లో బాలికలు ప్రతిభ..



**జమ్మికుంట, జనవరి 21( మన వార్త ప్రతినిధి):**సోషల్ టాలెంట్ టెస్ట్ లో జమ్మికుంట బాలికల పాఠశాల కు మొదటి రెండు స్థానాలు లభించాయి. పదవ తరగతి విద్యార్థుల్లో సామాజిక శాస్త్రానికి సంబంధించిన విజ్ఞానాన్ని వెలికి తీయాలనే లక్ష్యంతో తెలంగాణ విద్యా శాఖ, తెలంగాణ సోషల్ ఫోరం సహకారంతో ప్రతి సంవత్సరం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో సోషల్ టాలెంట్ టెస్ట్‌లను నిర్వహిస్తోంది. ఈ విద్యా సంవత్సరానికి గాను మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌ను బుదవారం జమ్మికుంట బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ కు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ పోటీలో జమ్మికుంట బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు మహాలక్ష్మి ప్రథమ స్థానం, మన్య శ్రీ ద్వితీయ స్థానాన్ని సాధించి పాఠశాల ఖ్యాతిని పెంచారు. విజేతలైన విద్యార్థినులకు జమ్మికుంట బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాదం సురేష్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సదానందం,చంద్రశేఖర్, మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులను బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# మేడారం జాతర తర్వాతనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలి..



**–బీసీ సంక్షేమ సంఘం డిమాండ్...**

**కరీంనగర్, జనవరి 21( మన వార్త ప్రతినిధి):**కరీంనగర్ లోని భాగ్య నగర్ లో గల బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బుదవారం ముఖ్య కార్యకర్తల సమావేశం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేయాలని బిపి సంక్షేమ సంఘం పక్షాన కోరడం జరిగింది. ఈనెల చివరన ఆసియాలోనే అతిపెద్ద జాతరగా గుర్తింపు పొందిన సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహించడం జరుగుతుంది తెలంగాణ లోని చాలా ప్రాంతాల ప్రజలు భక్తి శ్రద్ధల మధ్య ఈ పండుగను నిర్వహించుకుంటారు ఈ సమయంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడం ఇబ్బందికరంగా మారుతుంది ప్రభుత్వం ఈ సమ్మక్క సారక్క జాతరను గుర్తుంచుకొని ఎన్నికలను వాయిదాల వేయాలని భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం ప్రభుత్వం జాతర ఏర్పాట్లలో నిమగ్నమవడం వల్ల ఎన్నికలు కూడా నిర్వహించడం ఇబ్బంది కరంగా అవుతుంది వీటి అన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నికల్లో వాయిదా వేయాలని భక్తుల మనోభావాలను గౌరవించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ , బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్ చారి , బోయిని ప్రశాంత్ , రవి గౌడ్ , సతీష్ తో పాటు బీసీ సంక్షేమ మరియు అనుబంధ సంఘ నాయకులు కోరారు.

# హుజూరాబాద్‌ను జిల్లాగా ప్రకటించాలి..



**–అంబేద్కర్ కూడలి వద్ద భారీ నిరసన...**


**హుజురాబాద్, జనవరి 21( మన వార్త ప్రతినిధి):**హుజురాబాద్‌ను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సాధన సమితి నాయకులు మాట్లాడుతూ భౌగోళికంగా, పరిపాలనాపరంగా హుజురాబాద్ జిల్లా కావడానికి అన్ని అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎఈ నిరసన కార్యక్రమంలో జిల్లా సాధన కన్వీనర్ భీమోజు సదానందం మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం, ప్రాంత అభివృద్ధి కోసం హుజురాబాద్‌ను వెంటనే జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి సభ్యులు పోడిశెట్టి వెంకట్రాజం, వేల్పుల రత్నం, వేల్పుల ప్రభాకర్, తెలంగాణ కేసరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కేసరి మధుకర్ రావు, మార్త రవీందర్, క్యాస రమేష్, ఇప్పకాయల సాగర్, పులి జగన్నాథం, రామ్ రాజేశ్వర్, గంగిశెట్టి జగదీశ్వర్, అన్నాడి సత్తిరెడ్డి, కోటిలింగం, జి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ టీ యు క్యాలెండర్ ఆవిష్కరణ..




**జమ్మికుంట, జనవరి 21( మన వార్త ప్రతినిధి):** ఎస్ టీ యు జమ్మికుంట మండల శాఖ క్యాలెండర్ ను జమ్మికుంట మండల విద్యాధికారినీ మంతెన హేమలత ఎంఆర్సి ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఉపాధ్యాయులందరికీ నూతన సంవత్సరశుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో సమస్యలను పరిష్కరించడంలో ఎస్ టి యు సంఘం ముందు ఉ ందని అభినందించారు.,అదేవిధంగా అన్ని విద్య మరియు క్రీడ విషయాలలో జమ్మికుంట మండలం ముందు ఉండాలని సూచించారు. జమ్మికుంట మండలం ఎస్ టి యు అధ్యక్షులు నాగరాజు గారు మాట్లాడుతూ జిపి ఎఫ్ పెండింగ్ బిల్లులను మరియు సిపిఎస్ , డీ ఏ, ఎరియర్స్ ను వాయిదా పద్ధతిలో కాకుండా ఏక మొత్తంగా సత్వరమే ప్రభుత్వం చెల్లించాలని పెండింగ్ డీ ఏ లను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రజాక్,పాషా, జిల్లా కౌన్సిలర్లు పురుషోత్తం మూర్తి, రాజిరెడ్డి, రఘు, భాస్కర్ రెడ్డి, మండల ఆర్థిక కార్యదర్శి సమ్మయ్య, మండల ఉపాధ్యక్షులు రాజు, అసోసియేట్ అధ్యక్షులు తిరుపతి, కార్యవర్గ సభ్యులుదొంత రవి,వంశీకృష్ణ శైలజ స్వప్న కుమారి, అరుణ బోనాల శ్రీనివాస్, తిరుపతి, అశోక్ కుమార్, సారంగం, వేణుగోపాల్, మహేందర్ , రజిత ,లహరి,సంధ్యారాణి, సంధ్యాకాంతం, రాహుల్,. సుమయిర,. సీఅర్పి తిరుపతి,. రాంబాబు, శ్రీనివాసు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా..



**జమ్మికుంట, జనవరి 21( మన వార్త ప్రతినిధి):**మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లి మూడవ వార్డు అభ్యర్థిగా బీ జే పి పార్టీ నుండి కోలకాని రాజకుమారి రాజు పోటీలో నిలబడుతున్నారు. ఈ సందర్భంగా బుదవారం వార్డులో ప్రచారం ప్రారంభించారు. బీ జె పి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ పాల్గొని ప్రచారం చేశారు. అభివృద్ధి బీ జె పి తోనే సాధ్యం అవుతుందని తెలిపారు. రామన్నపల్లి అభివృద్ధి తోపాటు హనుమాన్ దేవాలయం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమములో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హోమ్ గార్డ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుల ఆవేదన



**జమ్మికుంట, జనవరి 21( మన వార్త ప్రతినిధి):**రక్షణ కల్పించాల్సిన ఖాకీ యూనిఫామ్ వేసుకుని, ఒక కుటుంబం మధ్య చిచ్చు పెట్టడమే కాకుండా.. రక్షక బటుడే రాక్షసుడై ప్రాణహాని తలపెడుతున్నాడో హోమ్ గార్డ్. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళ్తే జమ్మికుంటకు చెందిన స్వప్న అనే ఓ వివాహిత తన భర్తతో కలిసి జీవిస్తోంది. అయితే, అదే పట్టణానికి చెందిన ప్రభాకర్ అనే హోమ్ గార్డ్ సదరు మహిళపై కక్ష గట్టాడు. ఆమె పని చేసే చోట ఒక వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుందంటూ ఆమె భర్తకు వాట్సాప్‌లో తప్పుడు మెసేజ్‌లు పంపడం మొదలుపెట్టాడు. ఈ మెసేజ్‌ల వల్ల దంపతుల మధ్య తీవ్ర గొడవలు జరిగాయి. నిజం తెలుసుకున్న దంపతులు జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టిన పోలీసులు ఆ మెసేజ్‌లు పంపింది స్థానిక హోమ్ గార్డ్ ప్రభాకర్ అని గుర్తించి అతడిని అరెస్ట్ చేశారు. అయితే, బెయిల్‌పై బయటకు వచ్చిన ఆ హోమ్ గార్డ్ ఇప్పుడు మరింత రెచ్చిపోతున్నాడు. "మేము ఫిర్యాదు చేశామన్న కోపంతో మమ్మల్ని చంపేస్తానని బెదిరిస్తున్నాడు. మేము ఎక్కడికి వెళ్తే అక్కడికి వస్తూ నిఘా పెడుతున్నాడు. భయంతో బతకలేకపోతున్నాం" అని బాధితులు సోమవారం మళ్లీ పోలీసులను ఆశ్రయించారు. తమకు ప్రాణహాని ఉందని, కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, ఏసీపీ మాధవి చొరవ తీసుకుని తమకు రక్షణ కల్పించాలని, ఆ హోమ్ గార్డ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడు పోలీస్ శాఖకు చెందిన వ్యక్తి కావడంతో, ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# టేకూర్తి మోడల్ స్కూల్ వంటగది కి భూమిపూజ..



**ఇల్లందకుంట,జనవరి 21( మన వార్త ప్రతినిధి):**ఇల్లందకుంట మండలం, టేకూర్తి గ్రామంలోని మోడల్ స్కూల్లో వంటగది షెడ్ నిర్మాణానికి ప్రభుత్వం ఆర్డర్ కాపీ మంజూరు చేయగా బుదవారం భూమిపూజ చేశారు. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ తొడేటి శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంటగది కోసం పనులు ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కిచెన్ షెడ్ ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మరింత పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా అందించే అవకాశం కలుగుతుందని అన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని ప్రభుత్వం భావించి ఇలాంటి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం అభినందనీయం. టేకూర్తి మోడల్ స్కూల్ అభివృద్ధికి గ్రామ పంచాయతీ తరఫున పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. పాఠశాల మరింత ముందుకు వెళ్లాలంటే తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు, అధికారులు అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఈ పనులు త్వరగా, నాణ్యతతో పూర్తయ్యేలా సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ అభివృద్ధి పనులకు సహకరించిన ప్రభుత్వానికి, అధికారులకు, గ్రామ ప్రజలకు నా తరఫున ప్రత్యేక ధన్యవాదాలు అని చెప్పారు.

# అభివృద్దే ప్రధాన లక్ష్యంగా అంకితభావంతో పనిచేస్తా




**వేములవాడ 24వ వార్డు కౌన్సిలర్ గా రేగుల మల్లికార్జున్ పోటీ** రానున్న వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో పట్టణంలోని 24వ వార్డు కౌన్సిలర్‌గా భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత రేగుల మల్లికార్జున్ పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం వార్డు ప్రజలను కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రజల అభిప్రాయం,వారి సూచలనల మేరకు 24వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. భారతీయ జనతా పార్టీలో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మల్లికార్జున్ పార్టీలకతీతంగా వివాదరహితుడుగా మంచి పేరు సంపాదించుకున్నారు. వేములవాడ మున్సిపల్ చైర్మన్ పదవి ఈసారి బీసీ జనరల్ రిజర్వేషన్ కావడంతో ఆయన ఇక్కడి నుండి గెలిస్తే పార్టీ నుండి చైర్మన్ గా అవకాశం రావచ్చుననే ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో వార్డు ప్రజలు సైతం మల్లికార్జున్ నాయకత్వాన్ని బలపరుస్తూ పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన పోటీ దాదాపు ఖరారు కావడంతో తనదైన శైలిలో ప్రచారం మొదలుపెట్టారు. గెలుపే లక్ష్యంగా "ప్రజా సేవకై వస్తున్నాడ మీ బిడ్డగా ఆశీర్వదించండి" అనే నినాదంతో ఆయన ప్రజల ముందుకు వెళ్లుతున్నారు. మంచితనానికి మారుపేరుగా గుర్తింపు పొందిన రేగుల మల్లికార్జున్,ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ తోడుగా నిలిచే నాయకుడిగా వార్డులో విశేష ఆదరణ పొందుతున్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం అంకితభావంతో పనిచేసే వ్యక్తిత్వం ఆయన ప్రత్యేకతగా స్థానికులు పేర్కొంటున్నారు. సామాజిక కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ,పేదలు–మధ్యతరగతి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కార దిశగా కృషి చేసిన అపారమైన అనుభవం ఆయనకు ఉంది. ముఖ్యంగా 24వ వార్డు అభివృద్ధి, ప్రజల సంక్షేమం,తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల మెరుగుదలే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఇలాంటి మంచి నాయకుడిని ఎన్నుకుంటేనే వార్డు సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు మెరుగ్గా అందుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలతో మమేకమై,వారి సమస్యలను తన సమస్యలుగా భావించే నాయకుడిగా రేగుల మల్లికార్జున్ పేరు వార్డులో విస్తృతంగా చర్చకు వస్తోంది. భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ద్వారా వేములవాడ పట్టణ అభివృద్ధి,ప్రజల సంక్షేమం కోసం నిధుల మంజూరుకు తమ పార్టీ తరుపున ఎల్లవేళలా కృషి చేస్తామని ఆయన ప్రజలకు తెలియజేస్తున్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఆదరించి,ఆశీర్వదించి కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి 24వ వార్డు కౌన్సిలర్ గా తనని భారీ మెజార్టీ తో గెలిపించాలని మల్లికార్జున్ కోరుతున్నారు.

# సిసి రోడ్లు డ్రైనేజీ నిర్మాణంకు భూమి పూజ



**వేములవాడ జనవరి 21 (మన వార్త)** వేములవాడ పట్టణంలోని 11వ వార్డు విద్యానగర్ లో బుధవారం సిసి రోడ్లు డ్రైనేజీ నిర్మాణం కు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పీర్ మొహమ్మద్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీర్ మహమ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సహకారంతో వార్డులో రూ. 10 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. వేములవాడ పట్టణ, ఆలయ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో సాధ్యమైతుందన్నారు. రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో 11వ వార్డు కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని, వార్డు అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్తోనే అభివృద్ధి సాధ్యమని, వేములవాడ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు.

# ఆశయం కోసం కాదు ఆశకోసం బరిలో..!



**–కోసర్లతో అసలొల్లకు తిప్పలు...**

**–అభ్యర్థుల్లో అలజడి...**

**జమ్మికుంట, జనవరి 21( మన వార్త ప్రతినిధి):**ఎన్నికలు వస్తే చాలు ఆశయం కోసం కాదు ఆశ కోసం పోటీచేసే వారి హడావిడి అంతా ఇంతా కాదు. ఇదే తంతు ప్రస్తుతం రాబోయే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఆశ కోసం పోటీచేసే ఆశావహుల హడావిడి ఎక్కువవుతుందని,కొందరు వ్యక్తులు కేవలం డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో పోటీలో పాల్గొనడానికి ముందుకు వస్తున్నారని ప్రజలు చెర్చించుకుంటూ నవ్వుకుంటున్నారు. ముఖ్య నాయకుల దగ్గర తమకు పలుకుబడి ఉన్నట్లు నటిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి వారి వల్ల సేవచేయాలనే ఉద్దేశ్యంతో పోటీలో నిలుస్తున్న ఆశావహులకు తలనొప్పిగా తయారవుతుంది. ఇది ఇలా ఉంటే మరి కొంతమంది మాట్లాడుతున్న తీరు మరీ వింతగా ఉంది మేము కూడా ఎలక్షన్లో నిలుచుంటాం.. కానీ మాకు ఏదైనా స్వలాభం చేస్తే మేము పోటీ నుంచి తప్పుకుంటాం, వారికే మేము మద్దతిస్తాం అనే ఆశావాహుల సైతం కనపడుతున్నారు. దీనితో ప్రజలు, ప్రజాసేవ చేయాలనే నాయకులు సైతం ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో అనే పెద్ద డైలమాలో పడుతున్న సందర్భాలు ఎదురవుతున్నాయి. అసలు ఎవరో నకిలీ ఎవరో తేల్చుకోలేక డైలమాలో పడుతున్నారు.